
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

తిరుపతి
జిల్లా వార్తలు
బుధవారం 4 డిసెంబరు 2024




ప్రయోగ వేదికవద్దకు రాకెట్ భాగాలు

ఎగరడానికి రెడీ

స్వదేశీ, విదేశీ శాస్త్రవేత్తలతో శ్రీహరికోట రాకెట్ కేంద్రం సందడిగా మారింది. సాయంత్రం 4.08 గంటలకు పీఎస్ఎల్వీ-సీ 59 రాకెట్ ద్వారా యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ప్రోబా-3 ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి చేర్చనున్న సంగతి తెలిసిందే. మంగళవారం మధ్యాహ్నం 2.38 గంటలకు ప్రారంభమైన కౌంట్‌డౌన్ రేపు సాయంత్రం దాకా కొనసాగుతుంది. షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక మీద రాకెట్ ఎగరడానికి సిద్ధంగా ఉంది. కాగా, పీఎస్ఎల్వీ అనుసంధాన ప్రక్రియకు సంబంధించిన ఫొటోలను ఇస్రో మంగళవారం విడుదల చేసింది. పీఎస్ఎల్వీ ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ ఫెసిలిటీ (పీఐఎఫ్)లో రెండు దశల రాకెట్‌ను, మొబైల్ సర్వీస్ టవర్‌లో (ఎంఎస్‌టీ) మరో రెండు దశల రాకెట్‌ను అనుసంధానం చేశారు.

మొదటి దశ: 139 టన్నులు ఘన ఇంధనం కలిగిన రాకెట్ మొదటి దశను కేరళలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో డిజైన్ చేసి తీసుకొచ్చి శ్రీహరికోటలో అనుసంధానం చేశారు.





రెండో దశ: పీఎస్-2 మోటారులో 41 టన్నుల ద్రవ ఇంధనాన్ని నింపారు. విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో మోటారు తయారు చేశారు.




మూడో దశ: 7.65 టన్నుల ఘన ఇంధనం నింపారు.



4 **నాలుగోదశ:** ఈ దశలో 2.5 టన్నుల ద్రవ ఇంధనం నింపారు. రాకెట్ శిఖర భాగాన ప్రోబా-3 ఉపగ్రహాన్ని అమర్చారు. ఉపగ్రహం చుట్టూ హీట్‌షీల్డ్ (ఉష్ణకవచం) అమర్చారు. ఇది తుది దశ. ఉపగ్రహాలను నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టే రాకెట్ దశ ఇది. ఈ దశలో ఘన ఇంధనం మోటార్లకు నింపి రాకెట్‌కు అనుసంధానం చేశారు. కౌంట్‌డౌన్ జరిగే సమయంలోనే ద్రవ ఇంధనాన్ని నింపుతారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

ప్రోబా-3 ఉపగ్రహం




జలపాత ఝురులు

తుపాను వానలకు శేషాచలంలో కురిసిన వానలు వాగులై వంకలై పారి జలపాతాలుగా మారి దూకుతున్నాయి. గరుడవారధి మీద నుంచి మాలాడగుండం, కపిలతీర్థ జలపాతాలు నయనమనోహరంగా కనిపిస్తున్నాయి. శేషాచలం సిగలో ఈ జలవంకల సొగసు తిరుమలకు వచ్చే భక్తులనూ, తిరుపతి వాసులనూ మురిపిస్తోంది. మంగళవారం ఉదయంనాటి ఈ కమనీయ దృశ్యాలను ఆంధ్రజ్యోతి తిరుపతి ఫొటోగ్రాఫర్ అందిస్తున్నారు.









గరుత్మంతుడిపై లోకమాత

శ్రీవారికి ఇష్టుడైన గరుడుడు తిరుచానూరు కార్తీక బ్రహ్మోత్సవాల్లో మంగళవారం దేవేరికి వాహనంగా మారాడు. తిరుమల నుంచి తన పాదాలను సైతం శ్రీనివాసుడు తన ఇష్టసఖికి కానుకగా పంపడం విశేషం. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో ఆగమశాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం గావించిన తర్వాత రాత్రి గరుడుడిపై లోకమాతగా అమ్మవారు ఊరేగారు. శ్రీవారి పాదాలనూ, సహస్ర లక్ష్మీకాసుల హారాన్నీ ధరించిన పద్మావతీదేవి శ్రీమహావిష్ణువు రూపంలో గరుడుడిపై ఆశీనులయ్యారు. కళాబృందాల ప్రదర్శనలు, జీయర్‌స్వాముల ప్రబంధ పారాయణం, భక్తుల గోవింద నామస్మరణల మధ్య రాత్రి ఏడు గంటలకు గరుడ వాహనసేవ మొదలైంది. గరుడుడిపై అమ్మవారిని తిలకించడానికి తరలివచ్చిన భక్తులతో తిరుమాడవీధులు కిక్కిరిసిపోయాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

- మరిన్ని బ్రహ్మోత్సవ విశేషాలు 8లో -

వద్దన్నా వినకుండా..!

- వెళ్లడంతోనే వరద ప్రవాహంలో ఇద్దరి గల్లంతు
- ఒకరి మృతదేహం లభ్యం
- మల్లాం రొయ్యల కాలువ సమీపంలో ఘటన

చిట్టమూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రొయ్యల కాలువ వంతెన వద్ద వరద ప్రవాహం ఉధృతంగా ఉంది. ఆ మార్గంలో అధికారులు రాకపోకలను ఆపేశారు. అడ్డంగా ముళ్లకంపలు వేశారు. పోలీసులు కాపలా ఉంటున్నారు. ఆ మార్గాన వెళ్లడం ప్రమాదకరమని ద్విచక్రవాహనంలోని ఇద్దరిని మంగళవారం ఉదయం హెచ్చరించారు కూడా. బైకునూ నిలిపేశారు. అయినా వీరు పోలీసులు ఆదమరవగానే వెళ్లారు. గల్లంతయ్యారు. ఈ ఘటన చిట్టమూరు మండలం కొత్తగుంట- మల్లాం మార్గంలోని బాలచంద్రారెడ్డి ఎస్టేట్ సమీపాన చెప్టా వద్ద, రొయ్యల వాగు సమీపంలో చోటు చేసుకుంది. కోట మండలం జరుగుమల్లి గ్రామానికి చెందిన.. ప్రస్తుతం అత్తగారి ఊరైన బుచ్చిలో స్థిరపడి.. చిట్టమూరు కొత్తగుంట వద్ద చికెన్‌షాపులో మేనేజరుగా పనిచేస్తున్న వేణుంబాక మధుసూదన్‌రెడ్డి(45), ఇదే షాపులో పనిచేసే జార్ఖండ్‌కు చెందిన ఎండీ షారుక్(23) నీళ్లలో పడిపోయారు. మధుసూదన్‌రెడ్డి కొట్టుకుపోగా.. చెట్టును పట్టుకున్న షారుక్ అతడిని రక్షించడానికి సెల్‌ఫోనును ఆ చెట్టుపై పెట్టి వాగులో దూకారు. ఈ క్రమంలో ఈయనా గల్లంతయ్యారు. ఈ విషయం తెలిసి ఎంపీడీవో మనోహర్‌గౌడ్, తహసీల్దారు ప్రసాద్, సీఐ హుస్సేన్ బాషా, ఎస్ఐ చిన్న బలరామయ్య, వాకాడు ఎస్ఐ నాగబాబు సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. కోట ఫైర్ ఇంజన్ సిబ్బందితో గాలించినా ఫలితం లేకపోవడంతో జాలర్లను తీసుకొచ్చి వలల సాయంతో వెదికారు. మధుసూదన్‌రెడ్డి మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం కొరకు బాలిరెడ్డిపాళెం ఆసుపత్రికి తరలించారు. గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తిరుపతి అదనపు ఎస్పీ మనోహరాచారి సంఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. చీకటి పడడంతో షారూక్ ఆచూకీని గుర్తించలేరు. పోలీసుల మాట పెడచెవిన పెట్టడంవల్లే ఈ దురదృష్టకర సంఘటన జరిగిందని అధికారులు అంటున్నారు.



మధుసూదన్‌రెడ్డి - షారూక్ (ఫైల్ ఫొటోలు)

ఆనందమానందమాయె


స్లాటెడ్ భక్తులతో కలిసి వెళుతున్న స్థానికులు

- శ్రీవారి దర్శనంపై స్థానికుల హర్షాతిరేకం

తిరుమల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇక్కడ పుట్టి, పెరిగి స్వామినే నమ్ముకుని జీవిస్తున్న మాకు ప్రత్యేక గౌరవానిచ్చేలా దర్శనాన్ని కల్పించిన టీటీడీకి రుణపడి ఉంటామంటూ స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. తిరుమల, తిరుపతి రూరల్, అర్బన్, చంద్రగిరి, రేణిగుంట మండలాల ప్రజలకు సోమవారం ఉదయం తిరుపతిలో 2,500, తిరుమలలో 403 టోకెన్లు జారీ చేశారు. మంగళవారం ఉదయం 4 గంటల స్లాట్ నుంచి సాయంత్రం 6 గంటల స్లాట్ వరకున్న టోకెన్లతో వీరు శ్రీవారిని దర్శించుకున్నారు. దివ్యదర్శన క్యూలో వెళ్లిన వీరికి ఇతర భక్తులకులాగే ఓ లడ్డూను ఉచితంగా అందజేశారు.

53 నిమిషాల్లోనే దర్శనం

మేము 53 నిమిషాల్లోనే క్యూలైన్‌లోకి వెళ్లి దర్శనం పూర్తిచేసుకుని బయటకు వచ్చేశాం. ఇంత త్వరగా దర్శనం అయిపోతుందనుకోలేదు. లోపల కూడా మమల్ని నెట్టలేదు. మంచి దర్శనం దొరికింది. చాలా ఆనందంగా ఉంది.

- సుమతి



ప్రభుత్వం, టీటీడీ రుణం తీర్చుకోలేం

స్థానికులకు ప్రత్యేక దర్శనాన్ని కల్పించిన ప్రభుత్వం, టీటీడీ రుణం తీర్చుకోలేం. ఈ దర్శనాన్ని మళ్లీ తిరిగి ప్రారంభిస్తారనుకోలేదు. స్వామిని దర్శించుకునే అవకాశం కల్పించిన అధికారులకు, సిబ్బందికి ధన్యవాదాలు.

- గీత



స్థానికులుగా గర్వపడుతున్నాం

మాకు ప్రత్యేక గుర్తింపునిచ్చి స్థానికుల దర్శన కోటాలో దర్శనం చేయించడం చాలా సంతోషంగా ఉంది. మాకు ఇచ్చిన ఈ గౌరవానికి గర్వపడుతున్నాం. సుపథం నుంచి స్థానికులను అనుమతించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

- శ్రీదేవి



సిబ్బంది దురుసుతనం

స్లాట్ కంటే ముందుగా వచ్చామని సిబ్బంది అనుమతించకపోగా దురుసుగా మాట్లాడుతున్నారు. స్థానికులను ఇతర భక్తులతో కలిపి అనుమతిస్తున్నారు. ప్రత్యేకంగా పంపాలని కోరుతున్నాం.

- శ్రీనివాసమూర్తి



ఎస్వీయూలో కొనసాగుతున్న ఉద్రిక్తత

- అన్యమత ప్రచారం.. ప్రొఫెసర్‌పై దాడితో ఉన్నతాధికారుల సీరియస్
- నలుగురితో విచారణ కమిటీ ....

8లో



తిరుమల ఘాట్‌లో విరిగిపడిన కొండచరియలు

తిరుమల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలతో తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండో ఘాట్‌లో మంగళవారం కొండచరియలు విరిగిపడ్డాయి. వారంరోజులుగా కురిసిన వర్షాలతో కొండలు నానిపోయిన క్రమంలో హరిణిషెడ్ సమీపంలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఆ సమయంలో వాహనాలేవీ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. టీటీడీ ఫారెస్ట్, విజిలెన్స్, ఇంజనీరింగ్ అధికారులు పొక్లయినర్లు, ట్రాక్టర్లతో ఘటనా ప్రాంతానికి చేరుకుని చెట్లు, రాళ్లను తొలగించి వాహనాలను అనుమతించారు. బండరాళ్లు, మట్టి, చెట్లకొమ్మలను సాయంత్రానికి తొలగించారు. మరికొన్ని ప్రాంతాల్లోనూ కొండచరియలు విరిగిపడే అవకాశముందని అధికారులు అంచనావేసి నిఘా పెట్టారు.

నెలాఖరులోగా వరి బీమా ప్రీమియం చెల్లించాలి


జంగావాండ్లపల్లెలో 'పొలం బడి'

పాకాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో పంటల వివరాలను ఈ క్రాప్‌యాప్‌లో రైతు భరోసా కేంద్రం సిబ్బంది వద్ద నమోదు చేసుకోవాలని ఏడీఏ మనోహర్ బాబు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెద్దరామాపురం రైతు సేవాకేంద్రంలో సర్పంచ్ స్వర్ణలత అధ్యక్షతన రైతులకు సాగుపై సూచనలు ఇచ్చారు. ఈనెల 31లోపు ఎకరా వరికి బీమా ప్రీమియం రూ.630 చెల్లించాలన్నారు. ఈనెల 15లోపు ఎకరా వేరుశనగకు బీమా ప్రీమియం రూ.450 చెల్లించాలన్నారు.. ఏవో పుష్పావతి, ఏఈవోలు రమేష్ నాయక్, అమీర్ పాల్గొన్నారు. ●భాకరాపేట: పంటలకు బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ధనలక్ష్మి రైతులకు సూచించారు. జంగావాండ్లపల్లె, తిప్పిరెడ్డిగారిపల్లె గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యాన శాఖ అధికారి శివకుమారి, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.●ఎర్రావారిపాలెం; కమలయ్యగారిపల్లె ,ఉదయమాణిక్యం పంచాయతీల్లో జరిగిన పొలం బడి పిలుస్తోంది కార్యమంలో వ్యవసాయాధికారి ఖాదర్ బాషా పాల్గొని సూచనలు చేశారు.

దివ్యాంగులకు బంగారు 'భవిత'


బహుమతులు అందజేస్తున్న ఎంఈవో బాబ్జీ

భాకరాపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): 'భవిత' కేంద్రాల ద్వారా దివ్యాంగులకు బంగారు భవిష్యత్తు తీర్చిదిద్దుతారని ఎంఈవో-2 గోపీనాథ్ అన్నారు. చిన్నగొట్టిగల్లు భవిత కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు భవిత కేంద్రంలో స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ ఇస్తారన్నారు. అన్ని రకాల అలవెన్సులు, ఉపకరణాలు, మెడికల్ సర్టిఫికెట్లతో చిన్న చిన్న ఆపరేషన్ సేవలు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. వైద్యులు దీపశ్రీ, హెచ్‌ఎం వెంకటరమణ, ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ●పాకాల: స్థానిక భవిత కేంద్రంలో ఎంఈవో బాబ్జీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ రఫీ, ఉపాధ్యాయులు కుసుమ, మునికృష్ణారెడ్డి, సీఆర్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు. ●రామచంద్రాపురం: మంగళవారంమిట్టూరులో ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. ఎంఈవోలు మార్కొండయ్యనాయుడు, జయవేలు కమ్మకండ్రిగ సీఆర్‌సీ ప్రధానోపాధ్యాయురాలు వాగ్దేవి తదితరులు పాల్గొన్నారు.

తిరుమల దర్శన క్యూలో శునకం



తిరుమలలోని దర్శన క్యూలైన్‌లో మంగళవారం ఓ శునకం కూడా భక్తులతో కలిసి వెళుతూ కనిపించింది. సాధారణంగా తిరుమలలో స్థానికులూ శునకాలను పెంచకూడదు. ఎక్కడైనా శునకాలు కనిపిస్తే వాటిని హెల్త్ విభాగం సిబ్బంది పట్టుకుని తిరుపతికి తరలించాలి. కొద్దిరోజులుగా తిరుమలలో పెంపుడు కుక్కలు అధికమయ్యాయి. శ్రీవారి ఆలయంతో పాటు మాడవీధులు, కాటేజీలు, బస్టాండు, లడ్డూకౌంటర్ వంటి ప్రాంతాలతో పాటు బాలాజీనగర్‌లోనూ కనిపిస్తున్నాయి. తాజాగా మంగళవారం ఓ శునకం ఏటీజీహెచ్ వద్దనున్న స్లాటెడ్ సర్వదర్శనం భక్తుల క్యూలైన్‌లో వెళ్లడం అందరినీ ఆశ్చర్యపరిచింది. - తిరుమల, ఆంధ్రజ్యోతి

పంటలపై ఆగని ఏనుగుల దాడులు


ధ్వంసమైన టమోటా పంట

భాకరాపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పంట పొలాలపై ఏనుగుల దాడులు ఆగడం లేదు. సోమవారం రాత్రి భాకరాపేట పంచాయతీకి చెందిన దాసరి మల్లికార్జునకు చెందిన టమోటా పంట, చిట్టి వెంకటరత్నంకు చెందిన పీవీసీ పైపులు, మామిడి చెట్లు, అరటి చెట్లు ధ్వంసం చేశాయి. పొలానికి వేసిన కంచెను విరిచేశాయి. సుమారు 20 రాతి కూసాలు విరిగిపోయాయి. నష్టపోయిన పంటలను అటవీ శాఖాధికారులు పరిశీలించారు.

వరద బాధితులకు ఎమ్మెల్యే భరోసా


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పులిత్తివారిపల్లె వద్ద స్వర్ణముఖినది ప్రాంతాన్ని మంగళవారం ఎమ్మెల్యే నాని సందర్శించారు. వరద నీటితో ఐతేపల్లి-ఎ.రంగంపేట మధ్య రాకపోకలు స్తంభించిన నేపథ్యంలో ఆయన ఏరు దాటుకుని వచ్చి గ్రామస్తులకు భరోసా కల్పించారు. మండల స్థాయి అధికారులను పిలిపించి సత్వరమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండేళ్లలో వంతెనలు నిర్మిస్తామన్నారు. రూ.14.60 కోట్లతో ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ ఏసీ శేఖర్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేకలచేను జన్మస్థల శివాలయ భూముల పరిశీలన


గ్రామస్థులతో మాట్లాడుతున్న తహసీల్దారు

రామచంద్రాపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అనుపల్లి పంచాయతీ రేకలచేను జన్మస్థల శివాలయ భూములను తహసీల్దారు వెంకటరమణ మంగళవారం ప రిశీలించారు. శివాలయ నిర్వాహకులు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారని రేకలచేనుకు చెండిన కొందరు సోమవారం ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం తహసీల్దారు సిబ్బందితో వచ్చి అక్కడి నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణాలను నిలుపుదల చేయాలని ఆదేశించారు. దీనిపై విచారించి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తహసీల్దారు తెలిపారు. ఆర్‌ఐ లక్ష్మీనారాయణ, సర్వేయర్ రమేష్‌రాజు పాల్గొన్నారు.

పకడ్బందీగా సాగునీటి సంఘాల ఎన్నికలు: డీఈ సురేష్

రామచంద్రాపురం, డి సెంబరు 3(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఇరిగేషన్ డీఈ సురేష్ కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ భవనంలో మంగళవారం సాగునీటి సంఘ పోలింగ్ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం జరిగింది. డీఈ మాట్లాడుతూ మండలంలో రాయలచెరువు, అనుపల్లి, కుప్పంబాదూరు, కొడిచెరువు, పుల్లుట్లవాగు, పిల్లారికోన, అనుచెరువు, బొప్పరాజుపల్లి, సంగటిముద్దల కోన చెరువు, పీట్రకోన చెరువులకు సంబంధించి ఈనెల 5వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. తహసీల్దారు వెంకటరమణ, ఎంపీడీవో ఇందిర, ఏఈ యతిరాజులు పాల్గొన్నారు.

దర్శన క్యూలైన్లలో టీటీడీ చైర్మన్ తనిఖీలు

తిరుమల, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని శ్రీవారి దర్శన క్యూలైన్లలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డితో కలిసి ముందుగా ఏటీజీహెచ్ వద స్లాటెడ్ సర్వదర్శన క్యూలైన్‌ను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న తోపులాటలను దగ్గరుండి అధికారులు, సిబ్బందితో అదుపు చేయించారు. తర్వాత నారాయణగిరి ఉద్యానవనంలోని షెడ్ల వద్దకు చేరుకుని క్యూలైన్లను పరిశీలించారు. కాలినడక భక్తుల హాల్‌ను కూడా తనిఖీ చేశారు. రూ.300 ప్రత్యేక దర్శనం క్యూలైన్ వద్దకు చేరుకుని భక్తులతో మాట్లాడారు. ఈసందర్భంగా కొందరు భక్తులు లడ్డూలు, అన్నప్రసాదాలు రుచిగా, నాణ్యంగా ఉన్నాయంటూ ప్రసంశించారు. మరికొంతమంది దర్శనానికి చాలా సమయం పడుతోందని, త్వరగా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. క్యూలైన్ విధానం, దర్శన సమయం వంటి అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించి తగిన ఏర్పాట్లు చేపడతామని చైర్మన్ వారికి తెలిపారు.

లాన్ టెన్నిస్‌లో విజిలెన్స్ వీఎస్వోల ప్రతిభ


విజేతలను అభినందిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ఇటీవల కర్ణాటకలో జరిగిన ఆల్ ఇండియా పోలీస్ లాన్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో టీటీడీ విజిలెన్స్ అధికారులు సత్తా చాటారు. గత నెల నవంబరు 26 నుంచి 30వ తేదీ వరకు బెంగుళూరు కబ్బన్ పార్క్‌లోని కెఎస్‌ఎల్‌టీఎస్‌లో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ ఆల్ ఇండియా పోలీస్ లాన్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్-2024ను నిర్వహించింది. ఇందులో టీటీడీ విజిలెన్స్ వింగ్ వీఎస్వో రామ్‌కుమార్ వెటరన్ డబుల్స్‌లో రజత పతకాన్ని పొందారు. వీఎస్వో సురేంద్ర ఓపెన్ టెన్నిస్ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో రెండు రజత పతకాలు పొందారు. వీరిని టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్ అభినందించారు.

దివ్యాంగులకు ఉపాధి కల్పించాలి


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దివ్యాంగులు

చంద్రగిరి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు శాశ్వత ప్రాతిపదికన ఉపాధి కల్పించాలని పట్టెడన్నం సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మణికంఠ డిమాండ్ చేశారు. మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా చంద్రగిరిలోని టవర్ క్లాక్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరకంగా ఆర్థికంగా వెనుకబడిన దివ్యాంగులకు పెన్షన్‌తో పాటు శాశ్వత ప్రాతిపదికన ఉపాధి కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. .అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సమితి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష హింసకు వ్యతిరేకంగా ర్యాలీ



తిరుపతిరూరల్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ఓటేరు గ్రామ పంచాయతీలో మంగళవారం రూరల్ మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో లింగవివక్ష హింసకు వ్యతిరేకంగా అవగాహనా ర్యాలీని నిర్వహించారు. హింసకు వ్యతిరేకంగా కలసి కట్టుగా పనిచేస్తామని మహిళలు ప్రతిజ్ఞ చేశారు. డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏపీఎం పత్తిపాటి నాగేశ్వరరావు, మహిళలు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం

తిరుపతిరూరల్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పల్లెలో ఎంపీపీస్కూల్ ప్రాంగణంలోని భవిత కేంద్రంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఐఈ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈవో శంకరయ్య మాట్లాడారు. ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సరళ, టీచర్లు జి.ఉషారాణి, వైసుప్రియ తదితరులు పాల్గొన్నారు. టీడీపీనేత అమిలినేని మధు, మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఇక్కడి పిల్లలకు అన్నదానం చేశారు.

విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన

ఎర్రావారిపాలెం, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): విదార్థులు ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని అదనపు డీఎంహెచ్ఓ డాక్టరు శ్రీనివాసులురెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధి సంక్రమణ, వ్యాప్తి, అనర్థాలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, కోర్ సంస్థ ప్రతినిధులు తులసి, విజయ, ఎఎన్‌ఎం నర్సులు,ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులకు జలకళ


వర్షాలకు నిండిన పదిపుట్లబైలు రిజర్వాయర్


చెరువు నిండినా సాగని సామిరెడ్డి ఒడ్డు చెరువు మొరవ

పాకాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పారి మండలంలోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి, పదిపుట్లబైలు రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండింది. సుమారు 350 ఎకరాల ఆయకట్టుకు సమృద్ధిగా నీళ్ల చేరాయి. దామల చెరువు, వల్లివేడు,గానుగపెంట, మద్దినాయని పల్లె, మొగరాల, పాకాల పరిసరాల చెరువుల్లో 70 శాతం నీరు చేరింది. పెద్దరామాపురం, అమ్మచెరువు నిండింది. గానుగపెంట రామసముద్రం చెరువు, అమ్మచెరువు మొరవ పారితే పాకాల పెద్ద చెరువుకు నీళ్ల చేరనున్నాయి. దామలచెరువు పెద్ద వంక నుండి నీళ్ల మళ్లించకపోవడంతో దామలచెరువు-పాకాల సప్లయ్ ఛానల్‌లో నీళ్ల పారకపలు చెరువులకు నీళ్ల రాలేదు. పాకాల సమీపంలోని సామిరెడ్డి ఒడ్డు చెరువు పూర్తిస్థాయిలో నిండింది. మొరవ మరమ్మతులు చేయించకపోవడం, మొరవ ఎత్తు పెంచడంతో నీళ్ల కింద వైపునకు పారకపోవడం ఇంకాస్త వర్షం కురిస్తే కట్ట తెలిపోయే పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి మొరవలో కల్వర్టు నిర్మించి చెరువు కట్టను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

పేరూరు చెరువుకు జలహారతి


జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే పులివర్తినాని

తిరుపతిరూరల్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలోని పేరూరు చెరువు జలకళ సంతరించుకుంది. తొండవాడ వద్ద స్వర్ణముఖినది నుంచి సి.మల్లవరం మీదుగా ఈచెరువుకు నీరు వచ్చే సప్లైఛానల్స్‌కి అడ్డుగా ఉన్న మొక్కలుండేవి. ఎమ్మెల్యే పులివర్తి నానీ చొరవతో ఇటీవల స్థానిక టీడీపీనేతలు ఎక్స్‌వేటర్‌సాయంతో వాటిని తొలగించారు. దీంతో వర్షాలకు ఈ కాలువలగుండా చెరువుకు నీరు చేరింది.. ఈక్రమంలో మంగళవారం ఎమ్మెల్యే నానీ చెరువును సందర్శించి గంగమ్మతల్లికి జలహారతి సమర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..గతవైసీపీ పాలనలో చెరువులు, కుంటలను నిర్వీర్యం చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో వ్యవసాయసాగుకి రైతులకు నీరందించే చెరువులు, అనుబంధకాలువలకి మహర్దశరానుందని తెలిపారు. నాయకులు ఈశ్వరరెడ్డి, సుబ్రమణ్యంనాయుడు, శ్రీధర్‌నాయుడు, నాగూరు శ్రీనివాసులు, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే ఆదారిలో ప్రమాదాలే...



శ్రీనివాసమంగాపురం వద్ద వరద నీటిలో మునిగిపోయిన గుంత- వెంకటంపేట వద్ద రోడ్డు దుస్థితి

చంద్రగిరి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): చినుకు పడితే చాలు ఆదారిలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. చంద్రగిరి, శ్రీనివాసమంగాపురం మార్గంలో కొత్త ఫ్లైఓవర్ వద్ద నెల రోజులుగా రోడ్డు మరమత్తులకు గురైంది. గుంతలమయమైంది. వర్షం పడినప్పుడల్లా గుంతల్లో నీరుచేరుతోంది. లోతు తెలియకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఆ గుంత గుర్తించేందుకు వీలుగా ముళ్ళ కంపలు, రాళ్ళు పెట్టారు. ఫెంగల్ తుఫాన్ కారణంగా వర్షాలకు ఆ గుంత వాహనదారులకు కనిపించడం లేదు. దీంతో ప్రమాదాల భారిన పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ఇదే దారిలో తిరుగుతున్నా సమస్య గుర్తించకపోవడం దారుణమని వాహన చోదకులు విమర్శిస్తున్నారు. రాయలపురం పంచాయతీ వెంకటంపేట వద్ద రహదారిపై వరద నీటి సమస్య ఇప్పటి వరకు పరిష్కారం కాలేదు. వర్షాలకు చంద్రగిరి నుంచి పూతలపట్టు, నాయుడుపేట జాతీయ రహదారికి వెళ్ళే మార్గంలో వెంకటంపేట వద్ద రోడ్డుపై భారీగా వరద నీరు నిలిచిపోతోంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు.

'నాగాలమ్మ' పేరుతో దోపిడీ

● ఆలయ నిర్వాహకులపై జడ్పీటీసీ ఆరోపణ

చంద్రగిరి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నాగాలమ్మ పేరుతో దోచుకుంటున్నారని ఆలయ నిర్వాహకులపై జడ్పీటీసీ సభ్యుడు యుగంధర్‌రెడ్డి ఆరోపించారు. దాతల విరాళాలు వృథా అవుతున్నాయన్నారు. చంద్రగిరి జాతీయ రహదారిలోని నాగాలమ్మ ఆలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నేషనల్ హైవే వద్ద వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి సతీమణి సునంద రెడ్డి 2010లో కొన్న భూమిలో పురాతన కాలం నుంచి నాగాలమ్మ దేవాలయం ఉందన్నారు. ప్రస్తుతం ఆలయ అభివృద్ధి కమిటీ పేరుతో నాగాలమ్మ ఆలయ చైర్మన్ ఒంటి శివశంకర్‌రెడ్డి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. స్థల యజమాని అనుమతి లేకుండా ఆలయానికి గేట్లు, సీసీ కెమెరాలు పెట్టి, టిక్కెట్లు వసూలు చేస్తున్నారన్నారు. ధూప దీప నైవేద్యాలు, జీతాలు, విద్యుత్ బిల్లులు కూడా సునంద రెడ్డే చెల్లిస్తారని గ్రామస్తులకు చెప్పడంతో ఎలాంటి వసూళ్లు చేయకూడదని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారన్నారు. అయినా వసూళ్లు చేపట్టడంతో శివశంకర్‌రెడ్డిపై తన అనుచరులతో సునందరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయించారన్నారు దీంతో ఆలయం ఎదుట సునంద రెడ్డి ఫ్లెక్సీలు తొలగించారని ఆరోపించారు. వారి పేరు మీద చైర్మన్‌గా పెట్టిన బోర్డులు తొలగించడం దారుణమన్నారు. త్వరలోనే గ్రామస్తులు, అఖిల పక్షం నేతలతో సమావేశమై తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. చంద్రగిరి ఉపసర్పంచ్ నగిరి చంద్రశేఖర్ రెడ్డి, గ్రామస్తులు కొత్తపాటి మనోహర్ రెడ్డి, ప్రతాపరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మురగయ్య, మదన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎవరి వద్దా విరాళాలు సేకరించలేదు : శివశంకర్‌రెడ్డి

చంద్రగిరి నాగాలమ్మ ఆలయ చైర్మన్‌గా తాను ఎవరి వద్దా విరాళాలు సేకరించలేదని ఒంటి శివశంకర్‌రెడ్డి స్పష్టంచేశారు. తనపై ఆరోపణలు చేసేటప్పుడు ఆలయ అభివృద్ధిని చూడాలన్నారు. మంగళవారం రాత్రి నాగాలమ్మ ఆలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తనపై జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి తప్పుడు ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. అభివృద్ధి పనులను ధ్వంసం చేయడం దారుణమన్నారు. ఏ ఆలయంలోనైనా అర్చనకు, అభిషేకానికి, పొంగళ్లకు టికెట్లు పెడతారని గుర్తుచేశారు. ఆలయ నిర్వహణకు నెలకు రూ.50 వేలకుపైగా ఖర్చవుతుండటంతో టిక్కెట్ల రూపంలో కొంత సేకరిస్తున్నామన్నారు. మిగతా గ్రామస్థులే సాయం చేస్తున్నారని తెలిపారు. తాను రూ.8.50 లక్షల సొంత డబ్బును ఆలయానికి ఖర్చు చేశానని వెల్లడించారు. ఎంపీ విజయసాయిరెడ్డి స్థల దాతగా శిలాఫలకం కూడా వేసామన్నారు. విజయసాయిరెడ్డి, సునందరెడ్డి పేర్లు చెప్పి అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తాను తప్పు చేసినట్లు నిరూపిస్తే, ఏ శిక్షకైనా సిద్ధమన్నారు. ఈ సమావేశంలో గ్రామస్తులు బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, కోటేశ్వరరెడ్డి, మనోహర్ రెడ్డి, రామారావు, సుబ్రమణ్యం, వెంకటయ్య, మునికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో బెలారస్ వాణిజ్య ప్రతినిధుల బృందం

శ్రీసిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తూర్పు యూరప్‌లోని బెలారస్ దేశానికి చెందిన బెలారస్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (బెల్ సీసీఐ) ప్రతినిధుల బృందం తమ వాణిజ్య పర్యటనలో భాగంగా మంగళవారం శ్రీసిటీని సందర్శించింది. ఆ దేశ వాణిజ్య ప్రతినిధి దయానా తురానా నేతృత్వంలో 14 మంది విచ్చేశారు. వారికి శ్రీసిటీ ప్రెసిడెంట్ సతీష్ కామత్ సాదర స్వాగతం పలికి శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలు, పారిశ్రామిక అనుకూలతలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. పర్యటనలో భాగంగా శ్రీసిటీలోని అత్యాధునిక వసతులు, పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ, ఇతర కార్యకలాపాలను నేరుగా వీక్షించారు. వైటల్ పేపర్ పరిశ్రమను సందర్శించి, కంపెనీ ప్రతినిధులతో చర్చించారు.

రోడ్డు ప్రమాద బాధితునికి ఆర్థిక సహాయం


సంగీతకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్

చంద్రగిరి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన భీమవరం గ్రామానికి చెందిన సంగీతకు మంగళవారం తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ రూ.లక్ష చెక్కును అందించారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నారావారిపల్లి వచ్చిన సందర్భంలో బాధితుడు కలిసి గోడు విన్నవించుకున్నాడు. సంగీతకు ఆర్థిక సాయం అందించాలని ఆయన జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం సంగీతకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హేమాద్రి నాయుడు, మునిరత్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక బ్రహ్మోత్సవంలో కళాశోభ




తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో వెంకటేశ్వరస్వామి వేషధారణలో డాక్టర్ శ్రీరాజ్‌వీర్,అమ్మవారిగా డ్యాన్సర్ జగదీష్,గరుత్మంతునిగా నాగేంద్ర, హనుమంతునిగా కుశాల్‌కుమార్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుపతిలోని వివిధ కళావేదికలపై సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో మంగళవారం ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తిరుచానూరు ఆస్థాన మండపంలో ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు మంగళధ్వని, ఎస్వీ ఉన్నత వేద అధ్యయన సంస్థకు చెందిన పండితులచే చతుర్వేద పారాయణం నిర్వహించారు. సేతురామన్ ధార్మికపోన్యాసం, సురేష్ బృందం భక్తి సంగీతం ఆకట్టుకున్నాయి. కృష్ణకుమారి బృందం హరికథ పారాయణం చేశారు. సాయంత్రం ఆనందభట్టార్ బృందం అన్నమయ్య సంకీర్తనలను సుమధురంగా ఆలపించారు. మహతి కళాక్షేత్రంలో డాక్టర్ సత్యనారాయణ బృందం నృత్య ప్రదర్శన చేశారు. రామచంద్ర పుష్కరిణి వద్ద మ్యూజిక్ కాలేజీ విద్యార్థుల బృందం భక్తి సంగీతం, ప్రభావతి నేతృత్వంలో భరత నాట్యం నిర్వహించారు. శిల్పారామంలో డాక్టర్ శ్రీనివాసులు బృందం నృత్య రూపకాన్ని ప్రదర్శించింది.





ఆధ్యాత్మికానందం పంచిన కళా విన్యాసాలు

శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఆరవ రోజైన మంగళవారం ఉదయం సర్వభూపాల వాహనసేవలోనూ, రాత్రి గరుడసేవలోనూ కళాబృందాల ప్రదర్శనలు ఆధ్యాత్మికానందం కలిగించాయి. 254 మంది కళాకారులు ఈ సేవల్లో పాల్గొన్నారు. తిరుపతి ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థులు ప్రతి వాహనం ముందు పౌరాణిక ఇతి వృత్తాల ఆధారంగా ప్రదర్శనలు ఇచ్చారు. అష్ట దిక్పాలకులు, భరతనాట్యం, కూచిపూడి భక్తులను ఆకట్టుకున్నాయి. రాజమండ్రికి చెందిన కళాకారులు సాంప్రదాయ డమరుకం - గిరిజన నృత్యం ప్రదర్శించారు. తెలంగాణ కళాకారులు బోనం- కోలాటం, లంబాడి డ్యాన్స్ ప్రదర్శించగా, బాబు బృందం(కడప) డ్రమ్స్ భక్తులను అలరించాయి.

-తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

ఫిబ్రవరి 27 నుంచీ ఎస్వీయూలో అంతర్జాతీయ తెలుగు భాషోత్సవాలు


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో ఫిబ్రవరి 27, 28 తేదీల్లో అంతర్జాతీయతెలుగు భాషోత్సవాలను తెలుగు విభాగం - ప్రాచ్య పరిశోధన సంస్థ - తెలుగు సంపద సంస్థలు సంయుక్తంగా నిర్వహించనున్నాయి. శ్రీనివాసా ఆడిటోరియం వేదికగా ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ, ఓఆర్ఐ డైరెక్టర్ ఆచార్య వీసీ వేంకటేశ్వర్లు తదితరులు మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా భాషా, సాహిత్య రంగాల్లోనూ మార్పులు ఏర్పడుతున్నాయని తెలిపారు. సాహిత్య రంగంలో సాంకేతిక వినియోగం మరింతగా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా తెలుగు భాష పరిరక్షణ కోసం అవసరమైన ప్రయత్నం చేయనున్నట్టు చెప్పారు. ఈ సదస్సులో తెలుగు పరిశోధకులు, అధ్యాపకులు, భాషాభిమానులు, విద్యార్థులు పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పించాలని వారు కోరారు.

క్రీడల్లో ఎస్జీఎస్ కళాశాల విద్యార్థుల గెలుపు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ అంతర కళాశాలల టోర్నమెంట్‌లో ఎస్జీఎస్ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విద్యార్థులు బాలాజీ (చెస్-విన్నర్), నందకుమార్ (జూడో-విన్నర్), మాబాష (జూడో-రన్నర్), వెన్నెల, వేదవతి (టెన్నికాయిట్ - రన్నర్స్), రాహుల్, సాయిప్రసాద్ అథ్లెటిక్స్‌లో గెలుపొందారు. వీరిని ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు అభినందించారు.

అభివృద్ధికి అంగవైకల్యం అడ్డుకాదు


వికలాంగులకు బహుమతులు అందజేస్తున్న భాస్కర్‌నాయక్, తహసున్నిసాబేగం తదితరులు

తిరుపతి (విద్య), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి అంగవైకల్యం అడ్డుకాదని తిరుపతి అర్బన్ ఎంఈఓ భాస్కర్‌నాయక్ చెప్పారు. ఉయ్ సపోర్ట్ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు తహసున్నిసా బేగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవం స్థానిక బైరాగిపట్టెడలోని భవిత సెంటర్‌లో మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన భాస్కర్‌నాయక్ మాట్లాడుతూ... వికలాంగులమని అధైర్యపడకుండా పట్టుదలతో కృషి చేస్తే విజయాలు సాధించడం తథ్యమన్నారు. తహసున్నిసా బేగం మాట్లాడుతూ... గత మూడు సంవత్సరాలుగా తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో వికలాంగులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో ఎంజీఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కదిరి రవి, రామానాయుడు మున్సిపల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం భానుమతి, భవిత సెంటర్ ఉపాధ్యాయులు భవాని, జ్ఞానమ్మ, ఎంజీఎం హైస్కూల్ ఉపాధ్యాయులు ముని శారద, బండి మధుసూదన్ రెడ్డి, ఉయ్ సపోర్ట్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సుజాత, శివకుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అకౌంట్స్ ఆఫీసర్ల సంఘ సభ్యులకు అభినందనలు


లక్ష్మీనరసయ్యను కలిసిన ఏపీ స్టేట్ ఎలక్ట్రిసిటీ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులకు మంగళవారం కార్పొరేట్ కార్యాలయంలో సదరన్ డిస్కం డైరెక్టర్ వై.లక్ష్మీనరసయ్య అభినందనలు తెలిపారు. ఇటీవల విజయవాడలో నూతనంగా అసోసియేషన్ ఏర్పడింది. రాష్ట్ర కార్యవర్గంలో సదరన్ డిస్కం నుంచి ఉపాధ్యక్షులుగా బి.మధుసూదన్, టి.సురేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా పి.బాలాజీ, రాంబాబు, కుషకుమార్, జాయింట్ సెక్రటరీగా జి.నాగశ్రీనివాస్, కోశాధికారిగా వి.మధుసూదన్ రెడ్డిలు ఎన్నికయ్యారు. మంగళవారం వారు డైరెక్టర్ లక్ష్మీనరసయ్య, సీజీఎంలు కేఆర్ఎస్ ధర్మజ్ఞాని, పి.మురళి, సురేంద్రరావులను కలిసి కార్యవర్గాన్ని పరిచయం చేసుకున్నారు. అధికారులను కలిసిన వారిలో వి.కుమార్, శ్రీకాంత్, ప్రశాంతి, సురేంద్రనాయుడు ఉన్నారు.

రైల్వే ఉద్యోగ సంఘాలకు నేటి నుంచి గుర్తింపు ఎన్నికలు


తిరుపతి రైల్వే స్టేషన్‌లోని సీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారత రైల్వేలో పని చేస్తున్న ఉద్యోగ, కార్మికుల సంఘాలకు గుర్తింపు ఎన్నికలు బుధవారం నుంచి మూడురోజుల పాటు జరుగుతాయని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్లు డివిజన్ అధ్యక్షుడు కె.సుదర్శన్‌రాజు తెలిపారు. తిరుపతిలో సీడీవో కార్యాలయంవద్ద పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. పాకాల, చిత్తూరు, రేణిగుంట, శ్రీకాళహస్తి, వెంకటగిరితో పాటు డివిజన్‌లోని ప్రధాన స్టేషన్లలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. బుధ, గురువారాల్లో రైల్వేలో పనిచేస్తున్న సాధారణ ఉద్యోగులు, కార్మికులు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రన్నింగ్ స్టాఫ్ మాత్రం మూడు రోజుల్లో ఒక రోజు ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. గుంతకల్లు డివిజన్‌లో 14,453 మంది ఓటర్లకుగాను, తిరుపతి పోలింగ్ కేంద్రంలో 1025 మంది ఉన్నారన్నారు. రేణిగుంట రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని ఇన్‌స్టిట్యూట్‌లో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మజ్దూర్ యూనియన్ రేణిగుంట శాఖ కార్యదర్శి సురేష్ తెలిపారు. కాగా, దక్షిణ మధ్య రైల్వేలో సమస్యల పరిష్కారం కోసం పోరాడే సంఘానికి ఓటేయాలని సుదర్శన్ రాజు విజ్ఞప్తి చేశారు.

రాయలసీమ అభివృద్ధికి టీటీడీ నిధులు వినియోగించాలి

● ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి

తిరుపతి(లీలామహల్), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ అభివృద్ధికి టీటీడీ నిధులు వినియోగించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ (ఆర్సీపీ) రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన ఆ పార్టీ నేత చిన్నతో కలిసి మీడియాతో మాట్లాడారు. స్విమ్స్ తరహాలో కర్నూలు, కడప, నంద్యాల, అనంతపురం ప్రాంతాల్లోనూ టీటీడీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మించాలన్నారు. దీనిపై ప్రభుత్వం, టీటీడీ చర్చించాలని కోరారు. టీటీడీలో జరుగుతున్న అక్రమాలు, అవినీతిపై చర్యలు చేపట్టాలన్నారు. రాయలసీమ ప్రాంతాన్ని వ్యవసాయం, నీటిపారుదల, పారిశ్రామికరంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గాలేరు-నగిరి, హంద్రీ-నీవా పనులు పూర్తి చేస్తే పది లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఒంటిమిట్ట రామాలయంలో అభివృద్ధి పేరుతో ప్రజాధనాన్ని, టీటీడీ నిధులను ఖర్చుపెట్టారని, దీనిపై అప్పటి జేఈవో, నాయకులు, కాంట్రాక్టర్లపై విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు.

హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించాలి : ఆపస్

తిరుపతి(విద్య), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షులు శవన్నగారి బాలాజీ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మంగళవారం ఓ సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉండేలా గత ప్రభుత్వం మండలానికొక హైస్కూల్ ప్లస్‌ను ఏర్పాటుచేసిందని, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, ముఖ్యంగా బాలికలకు హైస్కూల్ ప్లస్‌లు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని వివరించారు. కూటమి ప్రభుత్వం వీటిని రద్దుచేసి ఇంటర్మీడియట్ శాఖకు అప్పగిస్తామని ప్రకటించడం ఏమాత్రం సబబు కాదన్నారు. స్కూల్ అసిస్టెంట్లకు ఒక ఇంక్రిమెంట్ పారితోషికంగా ఇచ్చి వారిని హైస్కూల్ ప్లస్‌లలో నియమించారని గుర్తు చేస్తూ... 24 సంవత్సరాల సర్వీసు పూర్తిచేసుకున్న స్కూల్ అసిస్టెంట్లు ఒక్క ప్రమోషన్ కూడా పొందలేకపోతున్నారని, అలాంటి వారికి కనీసం హైస్కూల్ ప్లస్‌ల వల్లనైనా ప్రమోషన్లు పొందుతున్నారని పేర్కొన్నారు. హైస్కూల్ ప్లస్‌ల రద్దు ప్రకటన అనేకమంది ఉపాధ్యాయులను నిరాశకు గురిచేస్తోందంటూ ఆ నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.

దేవదాయశాఖ అధికారులపై ఆక్రమణదారుల దౌర్జన్యం

పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు


దేవదాయశాఖ అధికారులతో వాగ్వాదం చేస్తున్న ఆక్రమణదారులు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణకు గురైన హథీరాంజీ మఠం భూములను సర్వేచేసి, అందులో ప్రహరీ గోడ నిర్మిస్తున్న అధికారులను ఆక్రమణదారులు అడ్డుకొని, దౌర్జన్యానికి పాల్పడిన సంఘటన మంగళవారం ఎయిర్‌బైపాస్ రోడ్డులో చోటుచేసుకుంది. దేవదాయశాఖ అధికారుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ఎయిర్‌బైపాస్ రోడ్డులోని సర్వేనెంబరు 266-3ఎలో హథీరాంజీ మఠం భూములు కొంత మేర ఆక్రమణకు గురయ్యాయనే సమాచారంతో మఠం ఏవో కే.ఎస్.రామారావు సిబ్బందితో వెళ్లి సర్వే చేయించారు. అందులో 7 సెంట్ల భూమి ఆక్రమణకు గురైనట్లు తేలడంతో ఆక్రమణదారుల నుంచి రక్షించేందుకు దాని చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టేందుకు మంగళవారం పనులు ప్రారంభించారు. దీంతో ఆ భూమిని ఆక్రమించుకున్న చంద్రమోహన్‌రెడ్డి తన అనుచరులతో వచ్చి ప్రహరీ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. నిర్మాణ పనులు నిర్వహిస్తున్న అధికారులతో వాగ్వాదానికి దిగి దౌర్జన్యానికి పాల్పడ్డారు. దీంతో మఠం భూమిని ఆక్రమించుకోవడమే కాకుండా అధికారుల విధులను అడ్డుకున్నందుకు చంద్రశేఖర్‌రెడ్డిపై హథీరాంజీ మఠం ఏవో కే.ఎస్.రామారావు మంగళవారం ఎస్వీయూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'జేఎంసీ' బకాయిలు విడుదల చేయండి

సీఎంకు ఎమ్మెల్యే శ్రీనివాసులు విజ్ఞప్తి - సీఎం పేషీనుంచి కదిలిన ఫైల్

తిరుపతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో జేఎంసీ కన్‌స్ట్రక్షన్స్ పేరిట చేసిన కాంట్రాక్టు పనులకు రూ32.78 కోట్లు బిల్లులు రాలేదని, వాటిని ఇప్పించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. ఆమేరకు గత నెల 21న సీఎం చంద్రబాబును లిఖితపూర్వకంగా కోరారు. రోడ్లు-భవనాలు (రూ13.58 కోట్లు), పంచాయతీరాజ్ శాఖ (రూ19.20కోట్లు)కు సంబంధించిన మరమ్మతులు, ప్యాచ్ వర్క్ చేసిన బిల్లులు గత మూడేళ్లుగా అందలేదని పేర్కొన్నారు. జేఎంసీ కన్‌స్ట్రక్షన్స్‌పై దాదాపు 500 మంది ఉద్యోగులు ఆధారపడి ఉన్నారని, బకాయి నిధులు విడుదల చేయాలని కోరారు. ఆరణి శ్రీనివాసులు చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తనకు సంబంధించిన జేఎంసీ సంస్థ నుంచి పెద్దఎత్తున కాంట్రాక్టు పనులు చేపట్టారు. అప్పటి బకాయిలను ఇప్పుడు విడుదల చేయాలని ఎమ్మెల్యే కోరారు. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఫైలు చిత్తూరుకు వచ్చినట్టు తెలిసింది.

భక్తుడి స్వర్ణ కాంతుల వాహనం


రాంభగీచ పార్కింగ్‌లో గోల్డ్ కలర్ కారు

తిరుమలలో మంగళవారం ఓ గోల్డ్ కలర్ కారు కన్పించింది. తమిళనాడులోని తిరువళ్లూరుకు చెందిన బాలమురగన్ అనే భక్తుడు బంగారు వ్యాపారి. ప్రత్యేకంగా గోల్డ్ కలర్‌తో తయారు చేయించిన వాల్వో కారులో ఆయన శ్రీవారి దర్శనం కోసం వచ్చారు. రాంభగీచ విశ్రాంతి భవనం వద్ద పార్కింగ్‌లో ఉన్న ఈకారును చూసిన కొంతమంది 'భలేఉందే ఈ గోల్డ్ కార్' అంటూ కొంతమంది ఫొటోలు కూడా తీసుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

రోగుల ఆరోగ్య భద్రత కోసం ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీన్ అల్లాడి మోహన్

తిరుపతి(వైద్యం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో వైద్యం పొందే రోగుల ఆరోగ్య భద్రత కోసమే త్వరలో ప్రముఖ పేరుపొందిన సంస్థలతో ఒప్పందాలు(ఎంవోయూ) కుదుర్చుకుంటున్నామని డీన్ అల్లాడి మోహన్ పేర్కొన్నారు. స్విమ్స్‌లోని శ్రీపద్మావతి మహిళా ఆడిటోరియంలో ఎంవోయూలకు సంబంధించి మంగళవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోగులకు మరింత నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు త్వరలోనే అప్లైడ్ బ్లాక్ చెయిన్ ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఐడీఎస్, ఐఎస్‌సీ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంటున్నామన్నారు. దీంతో లావాదేవీలను రికార్డ్ చేయడానికి, సమాచారాన్ని సురక్షితంగా ఉంచడానికి ట్యాంపర్ రెసిస్టెంట్‌గా పనిచేస్తుందని తెలిపారు. స్విమ్స్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకే ఈ ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ రామ్, మహిళా వైద్య కళాశాల, ఫిజియోథెరపీ కళాశాలల ప్రిన్సిపల్స్ ఉషాకళావత్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు



మీడియాతో మాట్లాడుతున్న నాగరాజు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 3: రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని, అవసరమైతే టీటీడీ నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా నూతన కార్యదర్శి వి.నాగరాజు డిమాండ్ చేశారు. స్థానిక యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గత రెండు రోజుల పాటు సత్యవేడులో జరిగిన 14వ జిల్లా మహాసభల్లో జిల్లా అభివృద్ధి కోసం రూపొందించిన తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు ప్రకటించారు. శెట్టిపల్లి ఇంటి స్థలాల బాధితులకు న్యాయం చేయాలని, స్మార్ట్ మీటర్లు అమర్చరాదని, ట్రూ అప్ చార్జీలు ప్రభుత్వమే భరించాలని, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపులను అరికట్టి రక్షణ చట్టాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా అభివృద్ధి కోసం తమ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు కందారపు మురళి, టి.సుబ్రమణ్యం, ఆర్.లక్ష్మి, డాక్టర్ పి.సాయిలక్ష్మి, మాధవ్, వేణు, హరినాథ్ పాల్గొన్నారు.

సీఎం చొరవతో బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి చెక్కు అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం భీమవరం గ్రామానికి చెందిన పి.సంగీత్(42) రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయాడు. తాను ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాడు. స్పందించిన సీఎం నారావారిపల్లె పర్యటనలో ఆర్థిక సాయం అందజేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో రూ.లక్ష చెక్కును బాధితుడికి కలెక్టర్ అందజేశారు. సంగీత్ సీఎంకు కృతజ్ఞతలు తెలిపాడు.

సీబీఎస్‌లో ఊడుతున్న సీలింగ్ పెచ్చులు

ఆందోళనలో ప్రయాణికులు ● కొంత మేర మూసివేత



చెన్నై పాయింట్ వద్ద ఉన్న టాయిలెట్ లోనికి ప్రయాణికులు వెళ్లకుండా అడ్డుగా రేకులు ఏర్పాటు చేస్తున్న దృశ్యం - కార్గో ముందు భాగంలో సీలింగ్ పెచ్చులను తొలగిస్తున్న కూలీలు


తొలగించిన సీలింగ్ పెచ్చుల కుప్ప

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ తిరుపతి సెంట్రల్ బస్సుస్టేషన్‌లో పెచ్చులూడుతున్న గదులను, స్థలాలను అధికారులు మూసివేశారు. తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి శ్రీహరి బస్టాండు భవనం ఉరుస్తోంది. దీంతోపాటు చిన్న చిన్న పెచ్చులు ఊడిపడుతుండటంతో ప్రయాణికులు ప్లాట్‌ఫామ్‌ల వద్ద బస్సుల కోసం వేచి ఉండటానికి ఆందోళన చెందుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. పెచ్చులూడుతున్న స్థలాలను గుర్తించారు. చెన్నై పాయింట్ వద్ద వున్న టాయిలెట్, కార్గో కేంద్రం దాదాపుగా, రిజర్వేషన్ కౌంటర్ ముందుభాగం, బస్టాండు లోపలికి వెళ్లే ప్రధాన ద్వారం, పై అంతస్తులో డ్రైవర్ల విశ్రాంతి గదులను పూర్తిగా బ్లాక్ చేశారు. ఆయా స్థలాల్లో ప్రయాణికుల సంచారం లేకుండా బ్యారికేడ్లు, సూచికబోర్డులు ఏర్పాటు చేశారు. కూలీలను నియమించి పడిపోవడానికి సిద్ధంగా ఉన్న పెచ్చులను తొలగించారు. తిరుపతి డిపోకు అనుసంధానంగా వున్న భవనంలో స్టోర్‌రూమ్, తమిళనాడు, కర్ణాటక డ్రైవర్ల విశ్రాంతి గదులను కూడా మూసివేశారు. వాటిని కూడా తొలగించనున్నారు. శ్రీహరి బస్టాండు పైఅంతస్తును త్వరలో పూర్తిగా తొలగించనున్నారు. ఇంటర్ మోడల్‌స్టేషన్(ఇంటిగ్రేటెడ్ బస్సుస్టేషన్) నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇప్పట్లో వచ్చే సూచనలు కనబడటంలేదు. దాంతో ఆర్టీసీ యంత్రాంగం ప్రయాణికుల రక్షణ దృష్ట్యా తక్షణ చర్యలకు పూనుకున్నారు. ఆర్టీసీ ప్రధాన కార్యాలయ నిర్ణయానికి అనుగుణంగా తదుపరి చర్యలు చేపడుతామని అధికారులు తెలిపారు.

పంచమీ తీర్థానికి విస్తృత ఏర్పాట్లు

● జేఈవో వీరబ్రహ్మం


బ్రహ్మోత్సవ ఏర్పాట్లు పరిశీలిస్తున్న జేఈవో వీరబ్రహ్మం

తిరుచానూరు, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం జరిగే పంచమీతీర్థానికి విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. మంగళవారం నవజీవన్ కంటి ఆసుపత్రి వద్ద, తోళ్లప్ప గార్డెన్స్, ఎస్వీ హైస్కూల్, పూడి రోడ్డులో హోల్డింగ్ పాయింట్లను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... పంచమీతీర్థానికి వచ్చే భక్తుల కోసం 120 అన్న ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. క్యూలైన్లలోని భక్తులకు తాగునీరు, అల్పాహారం, అన్నప్రసాదాలు, మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు. గురువారం సాయంత్రం నుంచి హోల్డింగ్ పాయింట్లలోకి భక్తులను అనుమతిస్తామన్నారు. హోల్డింగ్ పాయింట్లలో భక్తులు వీక్షించేందుకు ఎల్‌ఈడీ స్క్రీన్లు పెడుతున్నామన్నారు. శాశ్వత, తాత్కాలిక, మొబైల్ మరుగుదొడ్లు, సూచిక బోర్డులు, ప్రథమ చికిత్స కేంద్రాలు, హెల్ప్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పారిశుధ్య నిర్వహణకు 600 మంది అదనపు సిబ్బందిని నియమించామన్నారు. వెయ్యి మంది శ్రీవారి సేవకులు సేవలందిస్తారన్నారు. పంచమీతీర్థం మధ్యాహ్నం 12 గంటలకు మొదలవుతుందన్నారు. హోల్డింగ్ పాయింట్లలో ఉన్న భక్తులను 11 గంటల నుండి విడతల వారీగా పుష్కరిణిలోని అనుమతిస్తామని చెప్పారు. సమావేశంలో ఎఫ్ఏ సీఏవో బాలాజీ, సీఈ సత్యనారాయణ, ఎస్ఈ జగదీశ్వర్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

'టెన్త్ పరీక్షల కార్యాచరణ ప్రణాళిక అశాస్త్రీయం'

తిరుపతి(విద్య), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పబ్లిక్ పరీక్షల సన్నద్ధతకు పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన వందరోజుల కార్యాచరణ ప్రణాళిక పూర్తిగా అసంబద్ధంగా, అశాస్త్రీయంగా ఉందని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్ఎల్‌టీఏ) ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొడ్డ ఉమామహేశ్వర్, కిరణ్‌కుమార్ మంగళవారం ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. రెండో శనివారం, ఆదివారాల్లో కూడా పాఠశాలలు పనిచేయాలని ఉత్తర్వుల్లో పేర్కొనడాన్ని వారు ఖండించారు. సంక్రాంతి సెలవు దినాల్లో మూడు రోజులు మాత్రమే సెలవులు తీసుకుని మిగతా రోజులు పనిచేయాలనడం బాధాకరమని అన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించడంవల్ల విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతారని, తక్షణమే ఈ నిర్ణయాలను పునఃసమీక్షించాలని కోరారు. శని, ఆదివారాలు, పండుగ సెలవుల్లో తరగతులు నిర్వహించాలన్న నిర్ణయాన్ని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.



కార్తీక బ్రహ్మోత్సవాలు తిరుచానూరులో అంబరాన్నంటాయి. మంగళవారం ఉదయం అమ్మవారు కాళీయమర్థనుడి అలంకారంలో సర్వభూపాల వాహనాన్ని అధిష్ఠించి తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. సాయంత్రం 4.15 గంటలకు సర్వతేజోమయమైన అమ్మవారు బంగారురథంపై శ్రీమహాలక్ష్మి రూపాన్ని ధరించి తిరుమాడవీధుల్లో విహరించారు. స్వర్ణరథాన్ని లాగేందుకు మహిళలు పోటీపడ్డారు. రాత్రి శ్రీవారికి ఇష్టమైన గరుడుడు అమ్మవారికి వాహనంగా మారారు. శ్రీమహావిష్ణువు రూపంలో గరుడవాహనంపై అమ్మవారు ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 12 కళా బృందాల ప్రదర్శనలు వాహనసేవల్లో భక్తులను అలరించాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



అలమేలుమంగ.. అభయమీయంగ!











శ్రీవారి పాదాల ఊరేగింపు

గరుడోత్సవంలో అమ్మవారికి శ్రీవారి పాదాలను అలంకరించడం ఆనవాయితీ. తిరుమల ఆలయం నుంచి స్వామివారి స్వర్ణపాదుకలను మంగళవారం ఉదయం 11 గంటలకు తిరుచానూరులోని పసుపు మండపానికి తీసుకొచ్చి పూజలు నిర్వహించారు. శ్రీవారి పాదాలను తిరువీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. రాత్రి పద్మావతి అమ్మవారు స్వామివారి పాదాలు ధరించి గరుడసేవలో తరించారు. ఈ కార్యక్రమాల్లో ఉడిపిలోని పెజావర్ మఠాధిపతి విశ్వప్రసన్న తీర్థ స్వామి, టీటీడీ సభ్యులు జంగా కృష్ణమూర్తి, భానుప్రకాష్‌రెడ్డి, ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్‌వో సతీష్‌కుమార్, అర్చకులు శ్రీనివాసచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 8 గంటలకు: సూర్యప్రభ వాహనం

మధ్యాహ్నం 12 గంటలకు: స్నపన తిరుమంజనం

రాత్రి 7 గంటలకు: చంద్రప్రభ వాహనం



ఉపాధ్యాయుడి బదిలీపై రోడ్డెక్కిన 'ఏకలవ్య' విద్యార్థులు

- పోలీసుస్టేషన్, తహసీల్దారు కార్యాలయాల ఎదుట ధర్నా
- సొమ్మసిల్లిన ఇద్దరు బాలికలు
- విచారణ చేపట్టిన అధికారులు



పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని కనమనంబేడులోని ఏకలవ్య గురుకుల పాఠశాల సైన్సు టీచరు సుమన్‌ను బదిలీ చేయడంపై విద్యార్థులు మంగళవారం ఆందోళన చేపట్టారు. పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహించి పోలీసుస్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. సుమన్‌ను ఉద్దేశపూర్వకంగా ప్రిన్సిపాల్, వార్డెన్లు మార్పించారన్నారు. ఇంటర్ పరీక్షలకు రెండు నెలల ముందు సైన్సు ఉపాధ్యాయుడిని బదిలీ చేయిస్తే తమ చదువులు దెబ్బతింటాయన్నారు. బదిలీని రద్దు చేసే వరకు ధర్నా విరమించమని భీష్మించారు. ఉదయం టిఫిన్ చేయకుండా ధర్నాలో పాల్గొనడంతో ఇద్దరు విద్యార్థినులు స్పృహ కోల్పోయారు. ఎంఈవో రవీంద్రనాథ్ విద్యార్థులను సముదాయించారు. బదిలీపై విచారణ చేపడతామని చెప్పడంతో ధర్నా విరమించారు. కాగా, ఉపాధ్యాయుడి బదిలీ విషయంపై ఐటీడీఏ పీవో పరిమళ, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి సూర్యనారాయణ, తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంపీడీవో త్రివిక్రమరావు, ఎస్ఐ విశ్వనాథనాయుడు, ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం విచారణ చేపట్టారు. సుమన్ ప్రవర్తనపై, వైఖరిపై విద్యార్థులను విచారించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి బదిలీ నిలుపుదలకు ప్రయత్నిస్తామన్నారు.



ఏకలవ్య గురుకులంలో విచారిస్తున్న అధికారులు

అందరినీ ఒక్కసారిగా వదలడంతో..!

- ఏటీజీహెచ్ వద్ద భక్తుల మధ్య తోపులాట
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన విజిలెన్స్



ఏటీజీహెచ్ వద్ద భక్తుల మధ్య తోపులాట





దగ్గరుండి క్యూలైన్‌లోకి భక్తులను పంపుతున్న చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఏటీజీహెచ్‌లో టైంస్లాట్ భక్తుల మధ్య మంగళవారం తోపులాట జరిగింది. విజిలెన్స్ అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమని తెలుస్తోంది. మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఆగచాట్లు పడ్డారు. స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లు (ఎస్ఎస్‌డీ) పొందిన భక్తులను తిరుమలలోని ఎస్వీ గెస్ట్‌హౌస్ వద్దనున్న ఏటీజీహెచ్ కాటేజీ వద్దనున్న క్యూలైన్లలోకి అనుమతిస్తారు. మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ ఉండటంతో చాలా మంది భక్తులు ఎంబీసీ రోడ్డు వద్ద గుంపుగా చేరిపోయారు. వీరిని స్లాట్ల వారీగా క్యూలైన్‌లోకి అనుమతించాలి. వివిధ స్లాట్లలో ఉన్న భక్తులను వేరుచేయలేక విజిలెన్స్ అధికారులు, సిబ్బంది అందరినీ వదిలారు. భక్తులందరూ ఒక్కసారిగా ముందుకు దూసుకొచ్చారు. చిన్నపాటి వెడల్పుతో ఉన్న ప్రవేశమార్గాల్లో ముందుకు వెళ్లే క్రమంలో భక్తుల మధ్య తోపులాట జరిగింది. ఉదయం 11.30 నుంచి 12.30 గంటల వరకు ఇలా ఒకరినొకరు నెట్టుకోవడంతో చిన్నారులు, మహిళలు పెద్దగా కేకలు వేశారు. పైగా ప్రవేశమార్గాల్లో, క్యూలైన్ల నిర్వహణ బాధ్యతలను శ్రీవారి సేవకులకు అప్పగించడంతో తోపులాటను అదుపుచేయడం వీరికి సాధ్యం కాలేదు. ఇంతమంది అధికారులు, సిబ్బంది ఉండి కూడా ఇలాంటి నిర్లక్ష్యం ఏంటంటూ భక్తులు ఆగ్రహించారు. ఆ సమయంలో సర్వదర్శనం క్యూలైన్‌లో వెళ్లి శ్రీవారిని దర్శించుకోవాలనే ఉద్దేశ్యంతో టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఏటీజీహెచ్ వద్దకు చేరుకున్నారు. భక్తుల మధ్య తోపులాటను చూసిన ఆయన అధికారులతో పాటు చైర్మన్ బీఆర్ నాయుడికి సమాచారమిచ్చారు. దీంతో చైర్మన్ వెంటనే అక్కడికి చేరుకుని వైకుంఠం క్యూకాంప్లెక్స్ ఏవీఎస్వో, వీఐ ఇతర అధికారులను పిలిపించి తోపులాటలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దగ్గరుండి నెమ్మదిగా భక్తులను ముందుకు పంపడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

ఎస్వీయూలో ఉద్రిక్తత

- అన్యమత ప్రచారం.. ప్రొఫెసర్‌పై దాడి ఘటనలతో ఉన్నతాధికారుల సీరియస్
- తక్షణ విచారణకు నలుగురితో కమిటీ
- పోలీసు విచారణ చేపట్టాలని నిర్ణయం
- దళిత సంఘాలు, ఏబీవీపీ పోటాపోటీ ఆందోళనలు



పరిపాలనా భవనం వద్ద బైఠాయించిన దళిత సంఘాల నేతలు



వీసీ, రిజిస్ట్రార్లకు విన్నవిస్తున్న ఏబీవీపీ నేతలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం తలెత్తిన అన్యమత ప్రచార వివాదం నేపథ్యంలో మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. ఇటు అన్యమత ప్రచారం.. అటు ప్రొఫెసర్‌పై దాడి వ్యవహారాన్ని ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. మంగళవారం ఉదయాన్నే ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు సమావేశమయ్యారు. ఈ ఘటనలపై విచారణకు నలుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధారాణి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు. సభ్యులుగా ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కాలేజీ ప్రిన్సిపాల్ నరసయ్య, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లను నియమించారు. మరోవైపు వర్సిటీలో అన్యమత ప్రచారానికి పాల్పడిన ప్రొఫెసర్ చెంగయ్యపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పూజారి రాఘవేంద్ర, నాయకులు సురేంద్ర, పవన్, ఈశ్వర్, నందకిషోర్ తదితరులు ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. వర్సిటీలో మత విద్వేషాలకు చోటివ్వకూడదని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, టీఎన్ఎస్ఎఫ్, జీఎస్ఎస్, బీసీ యూనియన్ల నాయకులు అక్బర్, చిన్న, రవి, ఆర్కే నాయుడు, రామ్మోహన్, అశోక్, మల్లికార్జున, శివశంకర్‌నాయక్, మహేంద్రనాయక్ తదితరులు ఇన్‌చార్జి వీసీ అప్పారావుకు ఉమ్మడిగా వినతిపత్రం అందజేశారు. బయటి వ్యక్తులు ప్రొఫెసర్‌పై దాడి చేయడం వర్సిటీ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు. మత సంబంధమైన ఎలాంటి కార్యక్రమాలకు అనుమతి ఇవ్వకూడదని కోరారు. ఇక, దళిత ప్రొఫెసర్ చెంగయ్యపై దాడి అమానుషమంటూ పలు దళిత విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు పరిపాలనా భవనం ముందు నిరసన తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ప్రేమ్‌కుమార్, అమృతతేజ, సుధాకర్, యుగంధర్, సుబ్రమణ్యం, సుందర్, సదాశివ డిమాండు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో పెద్ద ఎత్తున పోలీసు బలగాలు మోహరించాయి. ఎలాంటి ఘటనలకు తావివ్వకుండా పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు.

శ్రీవారి సేవలో సుచిత్ర ఎల్లా దంపతులు



తిరుమల, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): భారత్ బయోటెక్ ఛైర్మన్ కృష్ణ ఎల్లా, ఆయన సతీమణి, బోర్డు సభ్యురాలు సుచిత్ర మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్న వారికి వేదపండితులు ఆశీర్వచనం చేశారు.

ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ దస్తావేజులు

- రేణిగుంటలో అన్ని రిజిస్ట్రేషన్లను పరిశీలిస్తున్నామన్న అదనపు ఐజీ

రేణిగుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్‌కు అవసరమైన దస్తావేజు తయారు చేసే విధానం ఆన్‌లైన్‌లో ఉందని, దాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రిజిస్ట్రేషన్ శాఖ అదనపు ఐజీ ఉదయ్‌భాస్కర్ చెప్పారు. రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండో రోజైన మంగళవారం కూడా రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ జరిగిన రిజిస్ట్రేషన్లకు సంబంధించిన అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ జరిగి పెండింగ్‌లో ఉన్న, రిలీజ్‌కాని పత్రాలను ప్రత్యేకంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఇక్కడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని త్వరలో పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేయనున్నట్లు తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగే అవినీతిపై ఆన్‌లైన్ ద్వారా కూడా ఫిర్యాదు చేయొచ్చని సూచించారు.



ఏఐజీ ఉదయభాస్కర్

రహదారులు, రైల్వే ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయండి

- కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టుల భూసేకరణ, పెండింగ్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లో జాతీయ రహదారులకు, రైల్వే ప్రాజెక్టు పనులకు తిరుపతి, రేణిగుంట రైల్వే బైపాస్‌రోడ్డు తదితరాలకు సంబంధించిన భూ సంబంధిత పెండింగ్ అంశాలపై, నిర్మాణ పురోగతిపై జేసీ శుభం బన్సల్‌తో కలిసి వర్చువల్ విధానంలో సంబంధిత అధికారులతో కలెకర్ సమీక్షా సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, పీడీ వెంకటేష్, ఎంకే చౌదరి, రవీంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సాల్ట్‌లైన్ ఫ్యాక్టరీ స్థలాల పరిశీలన


సాల్ట్ లైన్ ఫ్యాక్టరీ స్థలాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాఘువేంద్రమీనా

వాకాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగరాజపట్నం గ్రామంలో నూతనంగా ప్రారంభించనున్న సాల్ట్‌లైన్ ఫ్యాక్టరీ స్థలాన్ని మంగళవారం సబ్ కలెక్టర్ రాఘువేంద్రమీనా పరిశీలించారు. సాల్ట్ లైన్ ఫ్యాక్టరీకి సంబంధించి స్థలాలకు హద్దులను చూపించాలని పరిశ్రమ నిర్వాహకులు కోరడంతో పరిశీలిల చేపట్టామని సబ్ కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు రామయ్య, ఆర్ఐ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పంబలేరు చప్టాపై తగ్గిన వరద నీరు


పంబలేరు చప్టాపై రాకపోకలు సాగిస్తున్న విద్యార్థులు

గూడూరు అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావం కురిసిన భారీ వర్షాలతో పంబలేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో చప్టాపై రెండు రోజులు పాటు రాకపోకలు నిలిచిపోయాయి. వరద ఉధృతి తగ్గడంతో మంగళవారం యధావిధిగా రాకపోకలు కొనసాగాయి. పైప్రాంతాల నుంచి వరద నీరు పంపలేరు వాగుకు చేరుకోవడంతో పంబలేరు చప్టాపై మూడు అడుగులు మేర నీటి ప్రవాహం పెరగడంతో ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకుండా అధికారులు రెండు రోజులు క్రితం రాకపోకలు నిలిపివేశారు.

ఉప్పు భూముల పరిశీలన


భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దారు శరత్‌బాబు

తడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తడ కండ్రిగ పరిధిలోని ఉప్పు భూములను సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి మంగళవారం పరిశీలించారు. తడకండ్రిగ సర్వే నెంబరు 171లో ఉన్న సుమారు 264 ఎకరాల ఉప్పు భూములను పరిశీలించి వాటి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శరత్‌బాబు, సర్వేయర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేడు రైల్వే యూనియన్ ఎన్నికలు

తడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సదరన్ రైల్వేలో గుర్తింపు పొందిన యూనియన్లకు బుధ, గురువారాల్లో ఎన్నికలు జరగనున్నాయి. సూళ్లూరుపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరింగ్ కార్యాలయం, నాయుడుపేట రైల్వే స్టేషన్‌లోని కార్యాలయంలో ఎన్నికలకు ఏర్పాట్లు చేశారు. సూళ్లూరుపేట పరిధిలో 376 మంది, నాయుడుపేట పరిధిలో 274 మంది రైల్వే ఉద్యోగులు ఓటర్లుగా ఉన్నారు. సదరన్ రైల్వే పరిధిలోని 5 యూనియన్లు పోటీ పడుతున్నాయి. రెండు రోజులపాటు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించేందుకు రైల్వే ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేశారు.

పోలీస్‌స్టేషన్లలో ఎస్పీ తనిఖీలు


పెళ్లకూరులో పోలీస్ స్టేషన్‌లో
రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

పెళ్లకూరు, దొరవారిసత్రం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ సుబ్బరాయుడు మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసుల గురించి ఆరా తీశారు. స్టేషన్ ఆవరణలోని అన్ని గదులను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నేరాలను నియంత్రించేందుకు కృషి చేయాలని ఎస్ఐ నాగరాజుకు సూచించారు. అలాగే దొరవారిసత్రం పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఎస్ఐ అజేయ్‌కుమార్‌కు పలు సూచనలు చేశారు.

వైసీపీ అధికార ప్రతినిధి రాజీనామా

బాలయపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బాలయపల్లి మండలం వైఎసీపీ మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి రావి దేవికాచౌదరి తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు మంగళవారం ప్రకటించారు. తన రాజీనామా పత్రాన్ని పార్టీ అధినేత జగన్‌కు పంపినట్లు తెలిపారు. వ్యక్తిగత కారణాలతో పార్టీకి రాజీనామా చేశానని, రాజకీయ భవిష్యత్తు త్వరలో నిర్ణయం ప్రకటిస్తానని చెప్పారు.

జీఎన్‌టీ రోడ్డుకు మరమ్మతులు

సూళ్లూరుపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని జీఎన్‌టీ రోడ్డుకు మరమ్మతులు చేస్తున్నారు. వర్షానికి గుంతలమయంగా మారిన రోడ్డును బాగు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రైల్వేస్టేషన్ రోడ్డు నుంచి హోలీక్రాస్ కూడలి వరకు ఎక్స్‌కవేటర్ సాయంతో చదును చేసి కంకర తోలి గుంతలు పూడ్చుతున్నారు.


జీఎన్‌టీ రోడ్డులో గుంతలు పూడ్చుతున్న ఎక్స్‌కవేటర్

పారిశుధ్య పనులపై దృష్టి సారించండి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో వాణీరెడ్డి

వాకాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించి పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఎల్‌డీవో వాణిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి 15 రోజులకోసారి వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలన్నారు. అలాగే మురుగు కాలువల్లో బ్లీచింగ్ చల్లడంతో పాటు వీధుల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అలాగే గ్రామాల్లో ఎన్‌పీసీఐ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అన్నపూర్ణరావు, ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వర్‌రావు, పంచాయతీ కార్య దర్శులు, ఫిజికల్ అసిస్టెంట్‌లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ట్యాంకుల్లో తాగునీటి శుద్ధి కోసం క్లోరిన్ ట్యాబ్లెట్లు

దక్కిలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో తాగునీరు కలుషితం కాకుండా అన్ని ట్యాంకులను క్లోరిన్ ట్యాబ్లెట్ల ద్వారా శుద్ధి చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ ట్యాంకుల్లో క్లోరిన్ ట్యాబ్లెట్లు ఉపయోగించడం వల్ల తాగునీరు శుద్ధి చేయడం జరుగుతుందన్నారు. నెలలో రెండు దఫాలు విధిగా ట్యాంకుల్లో క్లోరిన్ ట్యాబ్లెట్లు కలపాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈవోపీఆర్డీ అల్లాభక్షు మాట్లాడుతూ వర్షాల వల్ల తాగునీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచడం ద్వారా అంటురోగాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

తడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాల కోసం ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందజేస్తోందని, దానిని ఆసరాగా చేసుకొని ఎవరైనా అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గంజాయి, ఇసుక అక్రమ రవాణా చేసేవారి గురించి పోలీసులకు వివరాలు అందజేయాలని, సమాచారం అందించిన వ్యక్తి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండప్ప నాయుడు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకు సాగాలి


కోటలో దివ్యాంగులకు బహుమతులు, పండ్లు పంపిణీ చేస్తున్న
జూనియర్ సివిల్ జడ్జి భరత్ కమల్

గూడూరు, కోట, చిల్లకూరు, సూళ్లూరుపేట, తడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంగవైకల్యం శరీరానికే కానీ, మనస్సుకు కాదని, దివ్యాంగులు అధైర్య పడకుండా మనోధైర్యంతో ముందుకు సాగాలని రెడ్ సంస్థ గౌరవ అధ్యక్షుడు మనపాటి రవీంద్రబాబు అన్నారు. మంగళవారం గూడూరులోని షాదీ మంజీల్‌లో రిహబిలిటేషన్, ఎడ్యుకేషన్ ఫర్ డిజేబుల్డ్(రెడ్) సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కల్గిన వారు ఎందులోనూ తక్కువ కాదని, పట్టుదలతో శ్రమిస్తే దేనినైనా సాధ్యం చేయవచ్చునన్నారు. అనంతరం దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ షరీనా, రైల్వే కమర్షియల్ అధికారి వెంకటేశ్వర్లు, మయూరి శ్యాం యాదవ్, అడవ పార్వతయ్య, మహబూబ్ బాషా, నయోమి, జానా సుధీర్, రాజేష్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు. ● కోటలోని విద్యా వనరుల కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం జరిగింది. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి భరత్‌కమల్ మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల ప్రేమ, ఆదరాభిమానాలు చూపాలన్నారు. చదువుకు అంగవైకల్యం అడ్డుకాదని, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. ఆటల పోటీల్లో గెలుపొందిన దివ్యాంగులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు శైలజ, మస్తానయ్య, ఎంపీడీవో వేణు, పల్లవి, ప్రసాద్, శాంతి, రేణుక, తదితరులు పాల్గొన్నారు. ● చిల్లకూరు మండలంలోని పారిచర్లపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం సుధాకర్, చంద్ర, మాదవయ్య, రవీంద్రరెడ్డి, చంద్రశేఖర్, మంజుశ్రీ, వివి కుమార్, షకీల తదితరులు పాల్గొన్నారు. ● సూళ్లూరుపేటలోని భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వాహకులు విద్యార్థులకు పుస్తకాలతో పాటు విద్యా సామగ్రిని అందజేశారు. ఎంఈవోలు శ్రీనివాసులు, శీనయ్య, భవిత ఉపాధ్యాయురాలు భార్గవి, ఆచార్య భరద్వాజ సేవా సంస్థ సభ్యులు లలిత, ఉపాధ్యాయులు సాయిసంధ్య, రమ, ఉషా, మురళి తదితరులు పాల్గొన్నారు. ● తడలోని భవిత కేంద్రంలో ఎంఈవో మల్లికార్జున్‌రావు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతి భావంతుల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు సురేష్, శ్రీనివాసులు, ఫిజియోథెరపిస్టు శిరీషా, ఉపాధ్యాయులు ప్రియాంక, కల్పన తదితరులు పాల్గొన్నారు.

డ్రం సీడర్ వినియోగంతో అధిక దిగుబడులు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ నాగర్జున సాగర్

వెంకటగిరిటౌన్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): డ్రం సీడర్ వినియోగంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ నాగర్జున సాగర్ అన్నారు. మంగళవారం స్థానిక సీసీ కండ్రిగలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక యంత్రాలతో వరి విత్తనాలు చల్లడం వల్ల ఖర్చు, సమయం ఆదా అవుతుందన్నారు. అలాగే ఈ-పంట నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం పశువుల్లో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

కురుగొండ, బత్తలాపురంలో 'పొలం పిలుస్తోంది'

ఓజిలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కురుగొండ, బత్తలాపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో విజయలక్ష్మి రైతులకు సూచనలు ఇచ్చారు. నారుమళ్ల పెంపకం, ఎరువులు, పురుగు మందుల వాడకం వంటి అంశాల గురించి వివరించారు.

ఈ క్రాప్ నమోదుపై శిక్షణ


గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ ఇస్తున్న ఏవో ప్రవీణ

పెళ్లకూరు, డిశంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు గ్రామ సచివాలయంలో మంగళవారం ఈ క్రాప్ నమోదుపై వీఏఏలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారిణి గొడవర్తి ప్రవీణ మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదుతో రైతులు సాగు చేస్తున్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ, వడ్డీలేని పంట రుణాలు, రాయితీపై వ్యవసాయ పరికరాలతో పాటు ఇతర పథకాలు రైతులకు అందుతాయన్నారు. పంటల బీమా పథకం కింద రైతు వాటా వరికి రూ.630 ఈనెల 31లోగా, వేరుశనగ పంటకు రూ.615 ఈనెల 15లోగా చెల్లించాలని ఏవో తెలిపారు. కార్యక్రమంలో వీఏఏలు చందు, దినేష్, శ్రీరాములు, ప్రదీప్‌కా, రాజేష్, మణి, తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణపై తహసీల్దారుకు ఫిర్యాదు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఎల్ఏ సాగరం పరిధిలోని రాఘవరెడ్డి చెరువును కొందరు ఆక్రమించుకుంటున్నారని తహసీల్దారుకు రైతులు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారుల చెరనుంచి చెరువును కాపాడాలని కోరారు.

హైవేలో వంతెనల పరిశీలన

వెంకటగిరి టౌన్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు - పెంచలకోన జాతీయ రహదారిలో ఉన్న పలు వంతెనలను హైవే అధికారులు మంగళవారం పరిశీలించారు. వంతెనల నాణ్యత, పరిమాణాలను లెక్కించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తున్నామని హైవే అధికారి సుధాకర్ తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై శిక్షణ

తడ, ఓజిలి, నాయుడుపేట, కోట, వాకాడు, దొరవారిసత్రం, పెళ్లకూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై తడ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇరిగేషన్ డీఈ శ్రీధర్, ఎంపీడీవో విజయకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సి జాగ్రత్తలు, ఓటర్ల జాబితా, ఎన్నికల నిర్వహణ వంటి విషయాల గురించి శిక్షణ ఇచ్చారు. ఇరిగేషన్ ఏఈ మస్తానయ్య, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఓజిలిలో ఎంపీడీవో విజయలక్ష్మి, నీటిపారుదలశాఖ ఏఈ వీరాస్వామి, నాయుడుపేటలో ఎంపీడీవో సురేష్‌బాబు, ఇన్‌చార్జి తహసీల్దారు రాజేంద్ర, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు, కోటలో తహసీల్దారు జయజయరావు, ఇరిగేషన్ ఏఈ మునిరత్నం, ఎంపీడీవో వేణు, వాకాడులోని ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు, ఎంపీడీవో అన్నపూర్ణరావు, తహసీల్దారు రామయ్య దొరవారిసత్రంలో తహసీల్దార్ శైలాకుమారి, ఎంపీడీవో గోవర్ధన్, ఇరిగేషన్ ఏఈ హరికృష్ణ, పెళ్లకూరులో తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, ఎంపీడీవో ప్రమీలారాణి, ఇరిగేషన్ ఏఈ సుబ్బరావు ఆధ్వర్యంలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.

దివ్యాంగులకు నిత్యావసరాలు, దుప్పట్ల పంపిణీ



దివ్యాంగులకు నిత్యావసరాలు అందజేస్తున్న రోటరీ వెస్ట్ క్లబ్ సభ్యులు

గూడూరు, డిసెంబరు 3,(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం ప్రంపచ దివ్యాంగులు దినోత్సవం సందర్భంగా రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎల్లసిరి గోపాల్ రెడ్డి దాతృత్వంతో దివ్యాంగులకు నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. క్లబ్ సభ్యులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, శ్రీకంఠి రామ మోహన్ రావు మాట్లాడుతూ దివ్యాంగులు నిరుత్సాహ పడకుండా ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాశిన నాగులు, ధనుంజయ రెడ్డి, సిద్ధారెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, కృష్ణ, సనత్‌కుమార్ రెడ్డి, గిరి బాబు తదితరులు పాల్గొన్నారు.

జియో ట్యాగింగ్‌పై అవగాహన కల్పించాలి

కోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జియో ట్యాగింగ్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వాణీరెడ్డి కోరారు. మండల పరిధిలోని కేశవరం, కోటలోని పలు సచివాలయాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. జియో ట్యాగింగ్ చేసే విధానంపై సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. మండలంలోని 21 పంచాయతీల్లో ఔట్‌హోల్డ్ సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణు పాల్గొన్నారు.

అన్నదానం

గూడూరు అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్ర స్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో డాక్టర్ మైథిలి, రమణ బాబు దాతృత్వంలో అన్నదానం చేశారు.



వంద పడకల ఆస్పత్రి ఏర్పాటుకు వినతి


సీఎంకు వినతిపత్రం ఇస్తున్న
ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వంద సంవత్సరాలుగా పేదలకు ఆరోగ్య సేవలందిస్తున్న పట్టణంలోని 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి స్థాయిని వంద పడకలకు పెంచాలని సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కోరారు. నియోజకవర్గంలోని పలు అపరిష్కృత సమస్యలను మంగళవారం సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. 1983లో పది పడకల ఆస్పత్రిని అప్పటి సీఎం ఎన్టీఆర్ చేతుల మీదుగా 30 పడకలకు నాటి ఎమ్మెల్యే ముద్దుకృష్ణమ ప్రారంభించినట్టు సీఎంకు దృష్టికి తీసుకెళ్లారు. రోజు 800 మంది రోగులకు వైద్య సేవలందిస్తూ అదనంగా 11 పోలీసు స్టేషన్ల పరిధిలో జరిగే ప్రమాదాలకు శవపరీక్షలు నిర్వహిస్తున్న ఈ ఆస్పత్రి స్థాయిని పెంచాలని కోరారు. నగరి, కార్వేటినగరంలలో కూడా వందపడకల స్థాయి ఆస్పత్రులు వచ్చాయని తెలిపారు. ఆస్పత్రి భవిష్యత్తు అవసరాల కోసం 1983లోనే స్థానిక చర్చి వద్ద స్థలాన్ని సేకరించి డాక్టర్లు, సిబ్బంది క్వార్టర్స్‌కు ఎన్టీఆర్ భూమి పూజ చేశారన్నారు. ప్రస్తుతం ఆ స్థలంలో నిర్మించిన క్వార్టర్స్ శిధిలావస్థకు చేరుకుందన్నారు.

భవిత కేంద్రాల శిక్షణతో దివ్యాంగులు స్వతంత్రులు


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీడీవో రమేష్‌బాబు

పుత్తూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల్లో దాగివున్న ప్రతిభను గుర్తించి తల్లిదండ్రులమీద ఆధారపడకుండా స్వతంత్రులుగా జీవించేందుకు విభిన్న ప్రతిభావంతులను భవిత కేంద్రాలు తీర్చిదిద్దుతున్నాయని పుత్తూరు ఎంపీడీవో రమేష్‌బాబు ప్రశంసించారు. స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల నమ్మకాన్ని కూడా ఈ కేంద్రాలు నిలబెడుతున్నాయన్నారు. ఎంఈవోలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ, ఐఆర్‌ఈపీ సూర్యకుమారి, ఆనంద్, జగదీశ్వరి పాల్గొన్నారు.

తుఫాను ప్రభావంతో నిండా మునిగిన రైతులు

పిచ్చాటూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు పంట పొలాలు మునిగాయి. పలు రకాల పంటలు దెబ్బతిన్నాయని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. మండలంలో భారీ వర్షాలతో వేరుశనగ విత్తిన రైతులు నిండా మునిగారు. వరి, పూల తోటలు, చెరకు, కూరగాయ పంటలు మూడు రోజుల వర్షానికి నీటమునిగి నష్టం వాటిల్లింది. రైతులు వేలకు వేలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు అకాల వర్షాలతో దెబ్బతినడంతో అప్పుల పాలైనారు. సాగు చేసిన పంట నష్టం వాటిల్లడంతో అధికారులు నష్ట నివారణ చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని కోరుతున్నారు. పొలాలను సందర్శించి నష్టాలను అంచనాలు తయారు చేసి నివేదికను ప్రభుత్వానికి అందించి రైతులకు ఈ సీజన్‌లోనే నష్ట పరిహారం అందేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పుత్తూరు వార్తలు

జనావాసాల్లోకి పాములు

● భయాందోళనలో ప్రజలు ● పట్టుబడిన రక్తపింజరి



పుత్తూరు అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు ప్రమాదం పొంచి వుంది. విషపూరితమైన పాములు ఇళ్లలోకి వచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రెండు నెలల క్రితం రూప అనే వివాహిత తన కుమార్తెను ట్యూషన్‌నుంచి తీసుకురావడానికి వెళ్తుండగా రోడ్డుపై పాముకాటుకు గురై ప్రాణాలు విడిచిన విషయం విదితమే. ఈక్రమంలో పట్టణంలోని ఎన్జీవో కాలనీ, జెండామాను వీధి, గేటు పుత్తూరు ప్రాంతాల్లో అత్యంత ప్రమాదకరమైన రక్తపింజరి పాములు చొరబడుతున్నాయి. గృహిణులు అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. మంగళవారం ఓ ఇంట్లోకి రక్తపింజరి దూరింది. వారు స్నేక్ క్యాచర్ శ్రీకాంత్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి దాన్ని పట్టుకుని దూర ప్రాంతంలో వదిలేశాడు. రక్తపింజరి... నాగుపాము కంటే పదిరెట్ల విషం కలిగి ఉంటుందని శ్రీకాంత్ తెలిపారు. ఈ పాము కాటు వేసిన వెంటనే ప్రథమ చికిత్స చేసుకోవాల్సి ఉంటుందని, లేదంలో లివర్, కిడ్నీ తదితర భాగాల పనితీరు స్తంభించిపోతుందని వివరించారు. ఒక వేళ పాము కాటుకు గురైనా భయపడకూడదన్నారు. కాటు వేసిన పాము ఏదని గుర్తించగలిగితే ఆస్పత్రికి వెళ్లిన వెంటనే డాక్టర్‌కు చెబితే తగిన విధంగా వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. వర్షాకాలం కావడంతో ఎలుకల కోసం పాములు వస్తుంటాయన్నారు. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో మొక్కలను తొలగించాలన్నారు. ఏది ఏమైనా ఎన్జీవో కాలనీ సమీపంలో గుట్టలు ఉండటం, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరగడం వంటివి పాముల రాకకు కారణంగా తెలుస్తోంది. మరో ప్రాణం పాముకాటుకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉంది.

పది మద్యం సీసాల స్వాధీనం: ఒకరి అరెస్టు

ఏర్పేడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తవీరాపురానికి చెందిన గాండ్ల రవిని అరెస్టు చేసి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ జయచంద్ర తెలిపారు. ఏర్పేడు పట్టణంలోని వైన్‌షాపులో మద్యం కొని అధిక ధరలకు గ్రామంలో విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. అతని నుంచి 10 మద్యం సీసాలు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు



బుచ్చినాయుడు కండ్రిగ, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ కూలీలు మద్యం మత్తులో తూగుతున్నారు. గ్రామాల్లో బెల్టుషాపులు అధికమవడంతో కూలీలకు వెళ్లకుండా బెల్టు షాపుల వద్దే తిష్ట వేస్తున్నారు. దీంతో పేద కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. బెల్టు షాపులను నియంత్రిచాల్సిన ఎక్సైజ్ అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడకపోవడంతో మద్యం ఏరులై పారుతోంది. పలు గ్రామాల్లో ఐదుకు పైగా బెల్టు షాపులు ఉండటంతో మందుబాబులు మత్తు వీడటం లేదు. ప్రభుత్వం బెల్టుషాపులను నియంత్రించాలని కఠినమైన ఆదేశాలు ఇస్తున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ఇకనైనా సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి బెల్టు షాపులను నియంత్రించాలని గ్రామీణ మహిళలు కోరుతున్నారు.

శ్రీసిటీలో బెలారస్ వాణిజ్య ప్రతినిధుల బృందం



శ్రీసిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తూర్పు యూరప్‌లోని బెలారస్ దేశానికి చెందిన బెలారస్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (బెల్ సీసీఐ) ప్రతినిధుల బృందం తమ వాణిజ్య పర్యటనలో భాగంగా మంగళవారం శ్రీసిటీని సందర్శించింది. ఆ దేశ వాణిజ్య ప్రతినిధి డయానా తురానా నేతృత్వంలో 14 మంది విచ్చేశారు. వారికి శ్రీసిటీ ప్రెసిడెంట్ సతీష్ కామత్ సాదర స్వాగతం పలికి శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలు, పారిశ్రామిక అనుకూలతలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. పర్యటనలో భాగంగా శ్రీసిటీలోని అత్యాధునిక వసతులు, పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ, ఇతర కార్యకలాపాలను నేరుగా వీక్షించారు. వైటల్ పేపర్ పరిశ్రమను సందర్శించి, కంపెనీ ప్రతినిధులతో చర్చించారు. బెలారస్ వాణిజ్య ప్రతినిధుల బృందం పర్యటనపై శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. భారత్, బెలారస్ దేశాల మధ్య వ్యాపార బంధం మరింత బలపడేందుకు ఈ పర్యటన కీలకమైనదిగా పేర్కొన్నారు.

ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి...

పారిశ్రామికవాడలో మద్యం దుకాణం



రేణిగుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారిశ్రామికవాడలో ప్రభుత్వ నియమ నిబంధనలను అతిక్రమించి మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వివాదాస్పదంగా మారింది. ఇటీవల ఏర్పాటైన ఈ దుకాణానికి ఎక్సైజ్ శాఖ అధికారులు అనుమతులు ఏలా ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. పారిశ్రామికవాడలో మద్యం దుకాణం పెట్టకూడదనే చట్టం ఉన్న విషయాన్ని మరవడం పట్ల విమర్శలు విని పిస్తున్నాయి. ఈ దుకాణ పరిసరాల్లోని పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళలు కూడా ఏర్పాటుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మద్యం దుకాణానికి గదిని అద్దెకు ఇచ్చిన యజమానికి ఏపీఐఐసీ అధికారులు నోటీసులిచ్చారు. అయినా ఇంతవరకు ఎటువంటి స్పందన కనిపించ లేదు. ఎక్సైజ్ సీఐ రవి నాయుడిని వివరణ కోరగా ప్రైవేటు ల్యాండ్ అని చెప్పి అనుమతులు తీసుకున్నారని, ఈ విషయం తమకు తెలియదని సమాధానమిచ్చారు.

ఆర్డీవో ఆకస్మిక పర్యటన



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

నాగలాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం తహసీల్దార్ కార్యాలయాన్ని శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రికార్డులను పరిశీలించి తహసీల్దార్ హనుమాన్ నాయక్‌ను వివరాలడిగి తెలుసుకున్నారు. అనంతరం బయట కొడియంబేడు సచివాలయం, సురుటుపల్లె చెక్‌పోస్టును తనిఖీ చేసి, పలు రికార్డులను పరిశీలించారు. కారణిలో ఏర్పాటు చేయనున్న ఇసుక రీచ్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండల పర్యటనకు వచ్చిన ఆర్డీవోను తెలుగు యువత తిరుపతి పార్లమెంట్ ఉపాధ్యక్షుడు రాంప్రకాష్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి మండలంలోని పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. ప్రధానంగా అరుణా నదిపై కొట్టుకు పోయిన కాజ్‌వేను త్వరితగతిన నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మురళి, మాజీ వైస్ ఎంపీపీ అన్బు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవల్లో అలసత్వం తగదు



రోగులతో మాట్లాడుతున్న బృందమ్మ

శ్రీకాళహస్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అలసత్వం లేకుండా పేదలకు నిబద్ధతతో మెరుగైన వైద్యసేవలందించేందుకు కృషి చేయాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ తల్లి బృందమ్మ కోరారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆమె మంగళవారం తనిఖీ చేశారు. ఇటీవల పలు సందర్భాల్లో అసౌకర్యాలు ఎదురవుతున్నాయంటూ రోగులు బృందమ్మ దృష్టికి తీసుకువచ్చారు. ఈక్రమంలో ఆమె తనిఖీ చేసి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. గత వైసీపీ పాలనలో ప్రభుత్వా స్పత్రితో పాటు సదరం, డయాలసిస్ కేంద్రాల నిర్వహణపై నిర్లక్ష్యపు నీడలు ఆవహించాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్యసేవలందేందుకు తిరిగి బృందమ్మ ప్రత్యేక శ్రద్ధ చూపాలంటూ వినతులు వెల్లువెత్తుతున్నాయి. ఆస్పత్రి నుంచి చేదు అనుభవం ఎదురైన రోగులు నేరుగా బృందమ్మకు ఫోన్ చేసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఓ మహిళలో ఆస్పత్రిలో చేరగా ఆమెకు ఇంజెక్షన్ ఇచ్చి మూడు రోజులు పట్టించుకోలేదు. అలాగే ఓ క్షయ బాధితుడికి మందులున్నా ఇవ్వలేదు. సదరం కేంద్రంలో సర్టిఫికెట్ ఇచ్చేందుకు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం, అలాగే డయాలసిస్ కేంద్రంలో పలు సమస్యలు ఎదరవుతున్నాయని నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో బృందమ్మ ప్రభుత్వా స్పత్రిని తనిఖీ చేశారు. వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్యసేవలందించాలని చెప్పారు.

విద్యార్థుల సందర్శన



ఏర్పేడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాల 9, 10 తరగతులకు చెందిన 71మంది విద్యార్థులు ఒకేషనల్ ట్రైనింగ్‌లో భాగంగా ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా మంగళవారం పల్లం సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయంలో కార్యకలాపాలు, విధి నిర్వహణ, డేటా ఎంట్రీ, ఆధార్ అప్‌డేట్ వంటి విషయాలపై తెలుసుకున్నారని ప్రధానోపాధ్యాయులు ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ సుధారాణి, ఉపాధ్యాయులు వాణి, కేవీ బాబు మెహర్‌బాబు, సురేష్, శ్రీరాములు, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సహిస్తే చాలు ప్రతిభ చాటుతారు

శ్రీకాళహస్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ విద్యార్థులను ప్రోత్సాహిస్తే సాధారణ పిల్లలకు ఏమాత్రం తీసిపోకుండా ప్రతిభ చాటుతారని ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య అన్నారు. పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలో ఉన్న భవిత కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ జనాభాలో దివ్యాంగులు పది శాతం ఉన్నట్లు పేర్కొన్నారు. దీనిని తగ్గించాలంటే మేనరిక వివాహాలు, బాల్య వివాహాలను నిర్మూలించాలన్నారు. ప్రత్యేక ప్రతిభావంతులకు భవిత పాఠశాలలో శిక్షణ అందించడం ద్వారా కొంత మేర సాధారణ స్థితికి తీసుకురాగలరన్నారు. అనంతరం వారికి పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీలు జనార్దన్, మజ్ను, ఐడీఎస్ఎస్ వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా బాబు రాజేంద్రప్రసాద్ జయంతి



శ్రీకాళహస్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాబుఅగ్రహారం పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వాతంత్ర్య సమరయోధుడు, మొదటి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ జయంతి వేడుకలను ఏపీజే అబ్దుల్ కలాం స్కౌట్ ట్రూప్ ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా జిల్లా స్కౌట్ యువజన విభాగం చైర్మన్ షేక్ అజారుద్దీన్ ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. స్వాతంత్ర్య, క్విట్ ఇండియా ఉద్యమాల్లో బాబు రాజేంద్రప్రసాద్ పాత్ర కీలకమన్నారు. మొదటి రాష్ట్రపతిగా, రాజ్యాంగ పరిషత్ చైర్మన్‌గా ఆయన సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జ్ఞానప్ప తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై అధికారులకు శిక్షణ

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరగు నున్న సాగు నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల అధికారులకు మండల పరిషత్ కారాలయ్యంలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. సత్యవేడు ఇరిగేషన్ డీఈ రత్నాకర్ రెడ్డి మాట్లాడుతూ... ఈనెల 8న 13 సంఘాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎన్నికల్లో ఆరుగురు సభ్యులను ఎన్నుకుంటారని, ఎన్నిక కాబడిన ఆరుగురిలో ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకుంటారని తెలిపారు. తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంపీడీవో త్రివిక్రమరావు, డీటీ చంద్రబాబు నాయుడు, ఏఈలు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా బీఎన్‌కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో ఎయిడ్స్‌పై డాక్టర్లు అవగాహన కల్పించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తుఫాన్ కారణంగా రాజీవ్‌నగర్‌లోని పనసకోన కాలువ పొంగి లోతట్టు ప్రాంతాలు నీటి మునిగిన నిరాశ్రయులకు టీడీపీ నాయకులు నిత్యావసర సరుకులు పంపిణీచేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సూచనలతో వీటిని అందజేసినట్లు తెలిపారు.

బసవతారకం మహిళా ప్రాంగణం ఏమైంది?

- 25ఏళ్ల క్రితం భూ కేటాయింపు
- క్రమంగా ఆక్రమణల పర్వం





బసవ తారకం మహిళా ప్రాంగణం కోసం శంకుస్థాపన చేస్తున్న గోపాలకృష్ణారెడ్డి - మహిళా ప్రాంగణం కోసం కేటాయించిన స్థలం



మహిళా ప్రాంగణ స్థలం కబ్జాకు గురికాకుండా గత ఏడాది ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనం

శ్రీకాళహస్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున బసవతారకం మహిళా ప్రాంగణం కోసం 25 ఏళ్ల క్రితం కేటాయించిన భూమి ఆక్రమణకు గురైంది. ఉన్నత ఆశయంతో తొలిసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు మహిళల ఆర్థిక స్వావలంబన కోసం డ్వాక్రా వ్యవస్థను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అదే స్ఫూర్తితో అప్పటి మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండు ప్రహరీకి ఆనుకుని బసవతారకం మహిళా ప్రాంగణం కోసం భూమిని కేటాయించారు. ఆ తరువాత పాలకులు, ప్రభుత్వాలు మారడంతో ప్రాంగణ నిర్మాణం అటకెక్కింది. రూ.20కోట్ల భూమి ఆక్రమణకు గురైంది.

1999లో అప్పటి మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో డ్వాక్రా పొదుపు సంఘాల వ్యవస్థను బలోపేతం చేశారు. అదే సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా మహిళా జన్మభూమిని ప్రత్యేకంగా నిర్వహించారు. శ్రీకాళహస్తిలో జిల్లాస్థాయి సభ జరిగింది. ఈక్రమంలో శ్రీకాళహస్తిలోని డ్వాక్రా సంఘాలు సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం కోసం, అలాగే పలు రకాల స్వయం ఉపాధి అంశాలపై శిక్షణ శిబిరాలు నిర్వహించుకోవడం కోసం ప్రభుత్వ భవనం అవసరమన్న దూరదృష్టితో ఆర్టీసీ బస్టాండుకు ఆనుకుని సర్వే నెం.185/2లో 1.10ఎకరాలను కేటాయించారు. 1999 మే 1 అప్పటి కలెక్టర్ ఆర్.కృష్ణయ్య సమక్షంలో బసవ తారకం మహిళా ప్రాంగణం పేరుతో శంకుస్థాపన చేశారు. ఆ తరువాత డీఆర్‌డీఏ నిధులతో మహిళ ప్రాంగణం నిర్మాణం చేపట్టేలా కసరత్తు చేశారు. అయితే కార్యరూపం దాల్చలేదు.

ఈక్రమంలో ప్రస్తుతం మహిళాప్రాంగణం సమీపంలో భారీ బహుళ అంతస్థుల అపార్ట్‌మెంట్లు శరవేగంగా నిర్మాణమయ్యాయి. 72 చదరపు అడుగుల అంకణం ధర రూ.5లక్షలకు చేరింది. ఈ లెక్కన మహిళా ప్రాంగణానికి కేటాయించిన భూమి విలువ రూ.20కోట్లకు పైమాటే. గత కొద్ది సంవత్సరాలుగా ఈ భూమిపై అక్రమార్కుల కన్నుపడింది. రాత్రివేళపాగా వేశారు. ఏడాది క్రితం మిగిలిన భూమిని సైతం ఆక్రమించేందుకు అప్పటి వైసీపీ నాయకులు భారీ స్కెచ్ వేశారు. పక్కనే ఉన్న సెటిల్‌మెంట్ భూముల సర్వే నెంబర్లు వేసి మహిళా ప్రాంగణం స్థలాన్ని ప్లాట్లుగా మార్చి గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు పథకం వేశారు. దీనిపై గత ఏడాది మేలో రూ.20కోట్ల భూమికి ఎసరు అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితం కావడంతో వైసీపీ నాయకుల కుట్రకు కళ్లెం పడింది. అయినా కొందరు ఇప్పటికీ ఏదో ఒక విధంగా మహిళా ప్రాంగణం భూమిలో చొరబడాలని పథకాలు రచిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో అక్రమార్కులు పాచికలు పారడం లేదు. కానీ ఇలాగే ఖాళీగా ఉంటే మిగిలిన 30శాతం భూమి కూడా కనుమరుగయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు మహిళా ప్రాంగణం కోసం కేటాయించిన భూమి మొత్తాన్ని సర్వే చేసి హద్దులు తేల్చాల్సి ఉంది. పట్టణవ్యాప్తంగా సుమారు 20వేలమంది పొదుపు సంఘాల మహిళలున్నారు. వారందరికీ మహిళా ప్రాంగణంలో అనువైన చోటును ఏర్పాటు చేస్తే చారిత్రాత్మకంగా నిలబడుతుందని అందరూ భావిస్తున్నారు. ఇకనైనా అధికారులు చిత్తశుద్ధితో మహిళా ప్రాంగణం భూమిని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మా భూములను కాపాడండి

- వేలవేడు దళితుల వినతి

శ్రీకాళహస్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేలవేడులో తమ భూములను ఆక్రమణ నుంచి కాపాడాలని మంగళవారం దళితులు శ్రీకాళహస్తి రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఐదు సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూములను అదే గ్రామానికి చెందిన వారు ఆక్రమించారని ఫిర్యాదు చేశారు. అడిగితే భౌతిక దాడులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని తహసీల్దారు లక్ష్మీనారాయణను వారు కోరారు.

పంటల బీమా తప్పనిసరి

కేవీబీపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పంట బీమా తప్పని సరిగా చేసుకోవాలని వ్యవసాయాధికారి కృష్ణకుమార్ చెప్పారు. మంగళవారం మండలంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో పంట బీమాపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 15తేదీ లోగా రైతులు బీమా చేయించాలన్నారు. ఎకరా వరికి ప్రీమియం రూ.630 కడితే రూ.42వేలు, వేరుశనగ ఎకరాకు రూ.450 చెల్లిస్తే రూ.30వేలు బీమా వర్తిస్తుందని చెప్పారు. అనంతరం తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వేరుశనగ పంటను పరిశీలించారు.

బియ్యపు భూ కబ్జాలపై విచారణ చేయించండి

- రెవెన్యూ మంత్రికి వినుత వినతి



రెవెన్యూ మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వినుత దంపతులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి చేసిన భూ కబ్జాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని కోరుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత రెవెన్యూ మంత్రికి వినతిపత్రం అందజేశారు. మంగళవారం విజయవాడలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ముక్కంటి తీర్థప్రసాదాలు అందించారు. అలాగే పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ముక్కంటి తీర్థప్రసాదాలు అందజేశారు. ముక్కంటి క్షేత్రమైన శ్రీకాళహస్తిలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని కోరారు.

రగ్బీలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



సత్యవేడు, డిసెంబరు 3: సత్యవేడు బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రగ్బీలో ప్రతిభ చాటారు. గుంటూరు జిల్లా వినుకొండ ఉన్నత పాఠశాలలో నవంబరు 28, 29 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీలకు పాఠశాల నుంచి అండర్-17 విభాగంలో టెన్త్ విద్యార్థులు డి.మునీంద్ర, డి.హేమంత్, తొమ్మిదో తరగతి విద్యార్థి అబ్దుల్ హమీద్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం భారతి తెలిపారు.

ఎన్‌ఎక్స్‌ప్లోరర్ ల్యాబ్ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో భువనేశ్వరి

శ్రీకాళహస్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలుర, బాలికల, సరస్వతీ బాయి పురపాలకసంఘ ఉన్నత పాఠశాలల్లో స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్‌ఎక్స్‌ప్లోరర్ ల్యాబ్‌లను ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాళహస్తిలోని మూడు ఉన్నత పాఠశాలల్లో ల్యాబ్‌లు ప్రారంభించం సంతోషకరమన్నారు. గత రెండు సంవత్సరాల నుంచి షెల్ ఇండియా సహకారంతో స్మైల్ ఫౌండేషన్ వారు తిరుపతి జిల్లాలోని 38 పాఠశాలలకు ఐకరాజ్యసమితి ప్రతిపాదించిన ప్రాపంచిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. ఒక్కో పాఠశాలలో రూ.2లక్షలతో ల్యాబ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, బృందాదేవి, జయసుధ, స్మైల్ ఫౌండేషన్ ప్రతినిధి విజయసారథి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురంలో 12వేల ఎకరాలకు సాగు నీరు



కలుజు పారుతున్న కళత్తూరు పెద్దచెరువు

కేవీబీపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో 12వేల ఎకరాలకు రెండు పంటలకు సాగుకు సరిపడా నీరు నిల్వ ఉందని ఇరిగేషన్ ఏఈ బాబు చెప్పారు. మండలంలో ఉన్న 126 చెరువులు నిండుకుండలా ఉన్నాయన్నారు. అలాగే కాళంగి జలాశయం గేట్లన్నీ మూసివేశామన్నారు. జలాశయానికి 3,200 క్యూసెక్కుల నీరు చేరుతోందని తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని స్కూటరిస్టు మృతి



చిన్న సుబ్బరామిరెడ్డి మృతదేహం

ఏర్పేడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ఉదయగిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో స్కూటరిస్టు దుర్మరణం చెందాడు. ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపిన వివరాలిలా... శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలుకు చెందిన చిన్న సుబ్బరామిరెడ్డి(58) నిత్యావసర సరుకుల కోసం ద్విచక్రవాహనంపై ఏర్పేడు మండలంలోని పల్లంపేటకు వెళ్లి తిరిగి స్వగ్రామం పయనమయ్యాడు. మార్గమధ్యంలో పల్లం వద్ద తిరుపతి నుంచి ఉదయగిరికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్న సుబ్బరామిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

అరణియార్ తూములో పడి మత్స్య కార్మికుడు మృతి



ఆర్ముగం(ఫైల్‌ఫొటో)

పిచ్చాటూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అరణియార్ మధ్య తూము కాలువలో పడి మత్స్య కార్మికుడు పడి మృతి చెందాడు. మృతుడు ఆర్ముగం(57)ది పిచ్చాటూరు గ్రామం. ఎప్పటిలాగే ఆర్ముగం మంగళవారం వేకువ జామున 5 గంటలకు ద్విచక్రవాహనంపై చేపల వేటనిమిత్తం అరణియార్ జలాశయానికి బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యంలో ఉన్న అరణియార్ మధ్య తూము కాలువలోకి ద్విచక్రవాహనం దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కాలువ సిమెంటు గట్టు ఆర్ముగం తలకు తగిలి తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించే ప్రయత్నించేలోపే మృతి చెందాడు. అరణియార్ మత్స్యకార సంఘం తరఫున మత్స్యశాఖ నుంచి లైసెన్స్ కలిగి ఉన్నాడు.

మరణించినా లోకాన్ని చూడనున్న గోవర్ధన్



వరదయ్యపాళెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బజారువీధికి చెందిన దేవాంగ చేనేత కార్మికుడు కాట్న గోవర్ధన్ (63) మంగళవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు సూళ్లూరుపేటకు చెందిన ఆచార్య భరద్వాజ సేవాసంస్థకు తెలియజేశారు. సంస్థ సమాచారంతో శంకర నేత్రాలయ నిర్వాహకులు బజారు వీధికి చేరుకుని గోవర్ధన్ నేత్రాలను సేకరించారు. పుట్టెడు దుఃఖంలోనూ కుటుంబసభ్యులు గోవర్ధన్ కళ్లను దానం చేయడం పట్ల పలువురు అభినందించారు. ఆయన మరణించినా మరొకరి ద్వారా ప్రపంచాన్ని చూస్తాడని అనుకుంటున్నారు.

నేడు హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 4న బుధవారం ఉదయం హుండీ లెక్కిస్తున్నట్లు ఈవో బాపిరెడ్డి పేర్కొన్నారు. ఆలయంలోని ప్రధాన హుండీలతో పాటుపరివార దేవతల వద్ద హుండీలను గురుదక్షిణామూర్తి సన్నిధిలో లెక్కించనున్నట్లు తెలిపారు. ఆలయ అధికారులు, సిబ్బంది లెక్కింపులో పాల్గొనాలని తెలిపారు.

13న చుక్కాణి ఉత్సవం

శ్రీకాళహస్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 13వ తేదీ చుక్కాణి ఉత్సవం నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఉత్సవం జరుగుతుందని తెలిపారు.

14న వెయ్యి లింగాల కోన దర్శనం

శ్రీకాళహస్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ వెయ్యిలింగాల కోన దర్శనం జరుగుతుందని ఈవో బాపిరెడ్డి ప్రకటన విడుదల చేశారు. అదే విధంగా 15వ తేదీ ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మర్షి చాగంటి కోటేశ్వరరావు శిష్యబృందం సుమారు 200మంది సభ్యుల ఆధ్వర్యంలో గిరిప్రదక్షిణ జరుగుతుందన్నారు.

16బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

ఏర్పేడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆమందూరు పంచాయతీ బీసీకాలనీలో మంగళవారం సాయంత్రం 16 రేషన్ బియ్యం బస్తాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన చెంగమ్మ ఇంట్లో అక్రమ రవాణా చేయడానికి నిల్వ ఉంచిన రేషన్‌బియ్యాన్ని సీఐ జయచంద్ర ఆధ్వర్యంలో సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ లోక్ అదాలత్

సత్యవేడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం శ్రీసిటీ పరిధిలోని చెరివి ట్రాన్స్‌కో ఏఈ కార్యాలయం ప్రాంగణంలో డిసెంబరు 4న విద్యుత్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు నాగలాపురం ట్రాన్స్‌కో ఏడీ రమేష్ తెలిపారు. బుధవారం ఉదయం 11.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుందన్నారు. వడమాలపేట, రాయలచెరువు, పుత్తూరు, నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు, వరదయ్యపాళెం మండలాల వినియోగదారులు పాల్గొనవచ్చు.

7న పేరెంట్ టీచర్స్ మీటింగ్

సత్యవేడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 7న నిర్వహించనున్న మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌ను పండుగ వాతావరణంలో జరపాలని ఎంఈవో రవి ఉపాధ్యాయులను సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో మీటింగ్ కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు.